తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం


ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 155

గురువారం 06, నవంబర్ 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## బండి సంజయ్ మరో సంచలన నిర్ణయం



- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ స్కూల్ పిల్లలకు అండ
- టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించాలని నిర్ణయం
- ఆయా జిల్లా కలెక్టర్లకు లేఖ ద్వారా వెల్లడి

కరీంనగర్,నవంబర్5(అక్షర గళం): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ శుభవార్త అందించారు. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. మిగతా..2లో

## తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

- సముద్రతీరాలు, నదీతీరాల్లో పుణ్యస్నానాలు
- ఆలయాల్లో శైవరాధన.. కార్తీక దీపాల వెలిగింపు

హైదరాబాద్/విజయవాడ,నవంబర్5 (అక్షరగళం): తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరించారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి, కృష్ణానదుల్లో స్నానం చేయడంతోపాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెలకొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన



చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేసారు. శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే పాతాళగంగలో పుణ్య స్థానాలు మిగతా..2లో

## డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్

- న్యూయార్క్, వర్జీనియా మేయర్లుగా డెమోక్రాట్లు
- న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ
- వర్జీనియాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హాష్మీ
- ఇద్దరూ భారతీయ మూలాలు ఉన్న వ్యక్తులే కావడం విశేషం

న్యూయార్క్,నవంబర్5(అక్షరగళం):

అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. అగ్రరాజ్యం అమెరికాలో పలు పదవులకు జరిగిన ఎన్నికల్లో భారతతి సంతతికి చెందిన వ్యక్తులు, డెమొక్రాట్లు తమ హవా కొనసాగించారు. యూఎస్ ఆర్థిక రాజధాని న్యూయార్క్, వర్జీనియాలో జరిగిన తాజా ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు విజయం సాధించారు.

న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించారు. ఈ ఘనత సాధించిన తొలి ముస్లిం,





భారత సంతతి, ఆఫ్రికన్ సంతతికి చెందిన తొలి మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. 34 ఏండ్ల మమ్దానీ జూన్‌లో జరిగిన డెమొక్రాటిక్ ప్రైమరీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మేయర్ అభ్యర్థిగా నిలిచారు. తాజాగా జరిగిన మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై మమ్దానీ మిగతా..2లో

# కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి

- అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు నొప్పి
- కాంగ్రెస్ అంటే ముస్లింలు..ముస్లింలు అంటే కాంగ్రెస్
- మైనార్టీల మద్దతుతోనే తాను కొడంగల్‌లో గెలిచా
- జూబ్లీహిల్స్‌లో మరోమారు సీఎం రేవంత్ ప్రచారం

హైదరాబాద్,నవంబర్5(అక్షరగళం):

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేట్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. భారత రాష్ట్ర సమితి పేరుతో భాజపా ఓట్లు అడుగుతోందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం



చెప్పాలన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు బాధో చెప్పాలన్నారు. కిషన్‌రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదు. నిన్న నేను మాట్లాడిన మాటలను వక్రీకరించారు. మొదటి నుంచి నేను సెక్యులర్ భావాలు ఉన్న వ్యక్తిని. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు అనేక అవకాశాలు కల్పించింది. కొడంగల్‌లో నేను 3 సార్లు గెలవడానికి మైనార్టీల సహకారం ఉంది. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఇబ్బందులు లేకుండా చూశాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. ఎందుకు ఇవ్వొద్దో.. కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఏం ఇబ్బంది. ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ ఒక్కటేనన్నారు. ముస్లింలను భారత రాష్ట్ర సమితి మోసం చేస్తోంది. సవాల్ విసిరి మిగతా..2లో

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు

- మండిపడ్డ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్

హైదరాబాద్,నవంబర్5(అక్షరగళం):

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా తనపై బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు తనపై తప్పుడు నిందలు వేస్తూ, అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. జూబ్లీ హిల్స్ ప్రజలు దొంగ సర్వేలను నమ్మరని పేర్కొన్నారు. ప్రజలకు తాను ఎల్లవేళలా అందు



బాటులో ఉన్నానని, గతంలో ఓటమి చెందినా ప్రజలతో మమేకం అయ్యానని నవీన్ మిగతా..2లో

## బిజెపిలో త్వరలోనే బిఆర్ఎస్ విలీనం

- ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువైంది
- గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు
- మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్న సీఎం
- రేవంత్‌తో భేటీ అయిన క్రైస్తవ సంఘాల నేతలు

హైదరాబాద్,నవంబర్5 (అక్షరగళం):

బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి మిగతా..2లో



## బీహార్‌లో ఎన్డీయే కూటమిదే విజయం

- మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు
- ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ

న్యూఢిల్లీ,నవంబర్5(అక్షరగళం):

బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బిహార్‌లో తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ప్రతిచోటా మునుపటి సభ కంటే భారీగా ప్రజలు వస్తున్నారని, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. బిహార్‌లో భాజపా-ఎన్డీయే మహిళా కార్యకర్తల్ని ఉద్దేశించి మంగళవారం ఆయన నమో యాప్ ద్వారా ప్రసంగించారు. 'మేరే బూత్.. సబ్‌సే మజ్‌బూత్' అనే సంకల్పంతో భాజపా మహిళా కార్యకర్తలు అమోఘమైన కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. బిహార్ ఎన్నికలను నేనెంతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాను. అందువల్ల ఎన్డీయేదే గెలుపు అని ఖాయంగా




చెప్పగలను. విజయంపై నాకెలాంటి సందేహం లేదు. పోలింగ్ మాత్రం ఇంకా పెరగాలని కోరుకుంటున్నాను. మహిళల సులభతర జీవనాన్ని మెరుగుపరడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్డీయే విజయం కోసం బిహార్ ప్రజలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని చెప్పిన ఓ మహిళతో మోదీ మాట్లాడుతూ- పేదలు, దళితులు, మహా దళితులు, బీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాల్లోనూ ఇదే భావన ఉందని అన్నారు.

## బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

- భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ ఓటింగ్
- ఉదయం 7నుంచి సాయంత్రి 6 వరకు పోలింగ్

పాట్నా,నవంబర్5(అక్షరగళం):

బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరం కీలక ఘట్టానికి చేరుకుంది. నేటి తొలివడత పోలింగ్‌కు ఇసి పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో కేటాయించిన పోలింగ్ కేంద్రాకు ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. రెండు విడతల పోలింగ్‌లో భాగంగా తొలి విడత పోలింగ్ 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో గురువారం జరుగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారం




భమై సాయంత్రం 6 గంటలతో ముగుస్తుంది. కొన్ని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రం ముందస్తు జాగ్రత్తగా సాయంత్రం 5 గంటలకే పోలింగ్ ముగుస్తుంది. తొలి విడత మిగతా..2లో

## పోక్సో కోర్టు సంచలన తీర్పు

- మైనార్ బాలికపై పదేపదే అత్యాచారం
- నిందితుడికి సహకరించిన బాలిక తల్లి
- ఇద్దరికి 190 ఏళ్ల జైలుశిక్ష విధింపు

తిరువనంతపురం,నవంబర్5(అక్షర గళం): కేరళలోని మంజేరిలోని ప్రత్యేక లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. మైనర్ బాలికపై పదేపదే లైంగిక దాడికి






పాల్పడినందుకు ఒక జంటకు చెరో 180 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 2019 నుంచి 2021 మధ్యకాలంలో నిందితులైన మహిళ, ఆమె భర్త కలిసి దారుణానికి పాల్పడ్డారు. మొదటగా బాధితురాలి తల్లి తన భర్తను విడిచిపెట్టిన తర్వాత ఈ దారుణమైన కేసు వెలుగులోకి వచ్చింది. తిరువనంతపురంలో ఉన్నప్పుడు నిందితురాలు ఆమె భర్తతో పరిచయం పెంచుకుని ఆ తర్వాత తన మిగతా..2లో




## మల్టీప్లెక్సుల్లో మండుతున్న ధరలు

- ఇలా అయితే థియేటర్ల మూత తప్పదు
- హెచ్చరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,నవంబర్5(అక్షరగళం): దేశంలోసింగిల్ స్క్రీన్ థియేటర్లు బాగా తగ్గిపోయాయి. మల్టీప్లెక్స్‌ల హవా నడుస్తోంది. అయితే, టికెట్ రేట్ల దగ్గరినుంచి తినే వస్తువుల వరకు మల్టీప్లెక్స్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మినిమం టికెట్ ధర 200 రూపాయలు పైనే ఉంటోంది. కొన్ని మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్ ధర 100 రూపాయలు.. కాఫీ ధర 700 రూపాయలు ఉంటోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు మల్టీప్లెక్స్‌లకు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మల్టీప్లెక్స్‌లపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యధిక ధరలు ఇలానే కొనసాగితే సినిమా హాళ్లు మూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. మల్టీప్లెక్స్‌లలోని టికెట్ రేట్లు మిగతా..2లో

# రేవంత్.. బస్తీ మే సవాల్!

- నేను లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధం .. రేవంత్ రెడ్డి సిద్ధమా?
- ప్లేస్, టైమ్ వాళ్లు చెప్పినా సరే.. మమ్మల్ని చెప్పమన్నా సరే
- కమాండ్ కంట్రోలా, గాంధీ భవనా, అసెంబ్లీనా? ఎక్కడైనా సిద్ధం
- బహిరంగ చర్చకు రా! రెండేండ్ల పాలన వైఫల్యాలపై తేల్చుకుందాం
- ఎవరు ఎంత అభివృద్ధి చేశారో రేవంత్ చర్చకు రెడీనా?
- కొత్తగా ఈ రెండేళ్లలో ఒక్క రోడ్డు అయినా నిర్మించావా?
- 'సీఎం అంటే చీఫ్ మినిస్టర్.. కట్టింగ్ మినిస్టర్ కాదు'
- దమ్ముంటే ఈ ప్రభుత్వం తనను అరెస్ట్ చేయాలి
- హైదరాబాద్ అభివృద్ధిపై రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

హైదరాబాద్

హైదరాబాద్‌లో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో దమ్ముంటే చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్లో ఏదేదో మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఆయన భాషలో ఆయనకు అర్థమైయేటట్లు చెప్పే సత్తా తమకు ఉందని అన్నారు.

కానీ రేవంత్ రెడ్డి మమ్మల్ని తిట్టినా.. మేం మాత్రం గౌరవంగానే మాట్లాడుతామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో రేవంత్ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించిన ఆయన.. దీంతో చెత్త ఎవరిది.. సత్తా ఎవరిదో తేలిపోతుందని అన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన



అంశాలను కేటీఆర్ ప్రస్తావించారు. హైదరాబాద్‌లో 42 పై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాం.. తమ హయాంలో స్టార్ట్ చేసినవాటికే కాంగ్రెస్ రిబ్బన్ కట్ చేసిందని వివరించారు. అవి కాకుండా.. కొత్తగా ఈ రెండేళ్లలో ఒక్క రోడ్డు అయినా నిర్మించావా అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. కొత్త రోడ్ల సంగతి తర్వాత.. కనీసం రోడ్లపై పడిన గుంతలైనా పూడ్చారా అని నిలదీశారు. నగర ప్రజలకు మళ్లీ వాటర్ ట్యాంకర్‌లపై ఆధారపడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా మిగతా..2లో

# డొనాల్డ్ ట్రంప్ పార్టీకి గట్టి షాక్

(మొదటి పేజీ తరువాయి)

విజయం సాధించారు. ఒక ఉన్నత కుటుంబం నుంచి స్వయం ప్రకటిత ప్రజాస్వామ్య సోషలిస్ట్ అయిన మమ్దానీ భారత సంతతికి చెందిన తల్లిదండ్రులకు ఉగాండాలో జన్మించాడు. ఏడేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. 2018లో సహజ పౌరసత్వం పొందారు. మరోవైపు వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో భారత సంతతికి చెందిన డెమొక్రటిక్ అభ్యర్థిని గజాలా హాష్మీ విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. హాష్మీ 15వ సెనెటోరియల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్ గజాలా. ఇలా న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్‌దానీ గెలిచి చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులను చిత్తు చేస్తూ 34 ఏళ్ల జొహ్రాన్ మేయర్ గా విజయం సాధించారు. ఈ పదవి దక్కించుకున్న తొలి భారత–అమెరికన్ ముస్లిం ఈయనే. భారతీయ మూలాలున్న మమ్‌దానీ మరెవరో కాదు.. బాలీవుడ్ ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడే. జొహ్రాన్ మమ్‌దానీ 1991 అక్టోబరులో ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ భారత మూలాలున్న వ్యక్తులే కావడం విశేషం. తల్లి మీరా నాయర్ పంజాబీ హిందూ మహిళ. భారత దిగ్గజ దర్శకుల్లో ఆమె ఒకరు. 'సలామ్ బాంబే', 'మాన్‌సూన్ వెడ్డింగ్' వంటి ప్రముఖ చిత్రాలతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. తండ్రి మహ్మూద్ మమ్‌దానీ గుజరాతీ ముస్లిం. బాంబేలో జన్మించిన మహ్మూద్ మమ్‌దానీ ఆ తర్వాత ఉగాండాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈయన విద్యావేత్త. జొహ్రాన్ మమ్‌దానీకి ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు మారింది. ఆ తర్వాత రెండేళ్లకే న్యూయార్క్‌కు మకాం మార్చి అక్కడే స్థిరపడింది. సైన్స్, ఆఫ్రికన్ స్టడీస్‌లో జొహ్రాన్ మమ్‌దానీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. జొహ్రాన్ మమ్‌దానీ రాజకీయ విజయాల వెనుక తల్లిదండ్రుల పాత్రే ఎక్కువ. ముఖ్యంగా తల్లి మీరా నాయర్ జీవితం నుంచే




ఆయన ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. నాలుగు దశాబ్దాల తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. సంప్రదాయ వాద, మూస సిద్ధాంతాలను సవాల్ చేస్తూ ముందుకుసాగారు. తన జీవిత అనుభవాలను ఒక్కొక్కటిగా కొడుకు జొహ్రాన్‌కు పాఠాలుగా చెప్పారు. 'మన కథలను మనం తరానికి చెప్పకపోతే ఇంకెవరు చెబుతారు' అనేది ఆమె సిద్ధాంతం. ఆమె చెప్పిన కథలే జొహ్రాన్‌రాజకీయ ప్రయాణానికి మూలస్తంభాలుగా నిలిచాయి. అణచివేతకు గళమెత్తాల్సిందే అనే నినాదంతో జొహ్రాన్ రాజకీయాల్లోకి వచ్చారు. 2020లో తొలిసారి న్యూయార్క్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇప్పుడు న్యూయార్క్ నగర మేయర్‌గా విజయం సాధించి మరో చరిత్ర సృష్టించారు. మమ్‌దానీ విజయం అధ్యక్షుడు ట్రంప్ పాలనకు గట్టి ఎదురు దెబ్బగా మారింది. ఈ ఎన్నికల్లో ఆయనను అడ్డుకునేందుకు రిపబ్లికన్ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించ లేదు. రిపబ్లికన్ల విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే మమ్‌దానీ.. తన ప్రచారంలో పదునైన విమర్శలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. దీంతో ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. మమ్‌దానీ ఎన్నికల్లో గెలిస్తే న్యూయార్క్ సిటీకి ఫెడరల్ సాయం అందదని ఓ దశలో అధ్యక్షుడు హెచ్చరించారు కూడా..! యూదు వ్యతిరేకి అంటూ రిపబ్లికన్లు ఆయనపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వాటన్నింటికి ఎదురొడ్డి నిలిచిన మమ్‌దానీ.. ఓటర్ల దృష్టిని ఆకర్షించడం పైనే ప్రధానంగా దృష్టిపెట్టారు. ఉచితాలు, హామీలతో ప్రచారం చేశారు. అవన్నీ కలిసొచ్చి మమ్‌దానీ విజయం సాధించారు.

**గజాలా హష్మి హైదరాబాద్ వాసి**

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమొక్రాట్ గజాలా హష్మీ విజయం సాధించారు. అమెరికా రాష్ట్రాల్లో ఈ పదవికి ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా ఆమె సరికొత్త రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌కు చెందిన గజాలా నాలుగేళ్ల ప్రాయంలో తన తల్లి, సోదరుడితో కలిసి అమెరికాలోని జార్జియాకు వెళ్లారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆమె తండ్రి ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు.



చదువుల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ అనేక స్కాలర్‌షిప్పులు, ప్రోత్సాహకాలు అందుకున్న గజాలా.. జార్జియా సదరన్ విశ్వవిద్యాలయంలో బీఏ ఆనర్స్ చదివారు. అట్లాంటాలోని ఎమరీ వర్సిటీ నుంచి సాహిత్యంలో పీహెచ్‌డీ చేశారు. అజహర్‌తో వివాహం అనంతరం గజాలా 1991లో రిచ్‌మండ్ ప్రాంతానికి మారారు. 30 ఏళ్ల పాటు ఆమె అక్కడే రేనాల్డ్స్ కమ్యూనిటీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2019లో ఆమె తొలిసారిగా అమెరికా ఎన్నికల్లో గెలుపొందారు. 2024లో ఆమె సెనెట్ విద్య, వైద్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా డెమొక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

## బిజెపిలో త్వరలోనే
# బిఆర్ఎస్ విలీనం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి



దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారి స్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్ట డానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్ప గించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు.

అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,

తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో
# కార్తీక పౌర్ణమి సందడి

(మొదటి పేజీ తరువాయి)

ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శాన్నికి 2 గంటల సమయం పట్టింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. ఆలయాల్లో దీపాలు వెలిగించి, పూజలు, అభిషేకాలు చేసారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. యాదాద్రి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ కనిపించింది. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారు మోగాయి. తెల్లవారుజాము నుండే అలయాలకు చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి, భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేసారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఝూరాసంగం కేతకి సంగమేశ్వర, సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు.

కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిట లాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్నారు. ధర్మపురి,బాసర, కాళేశ్వరంల వద్ద గోదావరి స్నానాలకు భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం ఆలాయాల్లో దీపారాధన చేపట్టారు.

# రేవంత్.. బస్తీ మే సవాల్!

(మొదటి పేజీ తరువాయి)

అని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో శానిటేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ కూడా సీఎంగా ఒక ఏరియాను ఎంచుకొని అక్కడ శానిటేషన్ పనులు పర్యవేక్షించారని గుర్తు చేశారు.

స్వచ్ఛ్ హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. వేలాది స్వచ్ఛ్ ఆటోలను ప్రవేశపెట్టామని అన్నారు. ఇప్పుడు కనీసం ఒక్క ఆటోనైనా ప్రవేశపెట్టారా అని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తమ హయాంలో ప్రతి రోజు 7.5 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించామని వెల్లడించారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు సాధించామని తెలిపారు.

బెస్ట్ క్వాలిటీలో నెంబర్ వన్ సిటీగా హైదరాబాద్‌కు అవార్డు వచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడే SNDP ని కూడా స్టార్ట్ చేసినట్లు తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మారిస్తే.. ఇప్పుడు దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మురికికూపంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక.. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించిదని గుర్తు చేశారు కేటీఆర్. ఈ రెండేళ్లలో ఒక్క ఇళ్లైనా కట్టారా అని ప్రశ్నించారు. దమ్ముంటే దీనిపై చర్చకు రావాలని రేవంత్ రెడ్డికి చాలెంజ్ చేశారు కేటీఆర్.

కాంగ్రెస్ సర్కార్ ఒక్క ఇల్లు కట్టకపోగా.. వేలాది ఇళ్లను హైడ్రా పేరుతో ఈ ప్రభుత్వం కూలగొట్టిందని ఫైరయ్యారు. మరోవైపు.. హైదరాబాద్ మెట్రోను పూర్తి చేసింది కూడా తమ ప్రభుత్వమేనని కేటీఆర్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మెట్రో సీఎఫ్‌వో, ఎల్ అండ్ టీ సీఎఫ్‌వోలను బెదిరిస్తోందని ఫైరయ్యారు. కాంగ్రెస్ బాధ తట్టుకోలేక, వాళ్ల బెదిరింపులకు తాళలేక ఎంత మంది పారిశ్రామికవేత్తలు పారిపోయారో చర్చకు సిద్ధమా అని నిలదీశారు.

ఇక.. కరెంటు విషయంలోనూ కాంగ్రెస్ తీరును ఎండగట్టారు కేటీఆర్. కాంగ్రెస్ హయాంలో వారానికి రెండు, మూడు రోజులు పవర్ హాలిడేస్ ఉంటే.. తాము అధికారం చేపట్టిన తర్వాత 24 గంటలు కరెంటు ఇచ్చామని గుర్తు చేశారు. ఎల్ఈడీ బల్బులతో తెలంగాణను దేదీప్యమానంగా చేశామని.. కానీ ఈ రెండేళ్లలో రేవంత్ సర్కార్ ఒక్క ఎల్ఈడీ అయినా పెట్టిందా అని ప్రశ్నించారు. ఎవరి హయాంలో విద్యుత్ వెలుగులు కొనసాగాయో.. ఎవరి హయాంలో విద్యుత్ కోతలతో ఇబ్బంది పడ్డారో చర్చిద్దామా అని సవాల్ విసిరారు కేటీఆర్.

కాంక్రీట్ జంగిల్‌లో కొత్తగా లంగ్ స్పేస్‌లు ఏర్పాటు చేసిన ఘనత తమదే అన్నారు కేటీఆర్. ప్రతి గ్రామంలో నర్సరీలు పెట్టి.. 16వేల నర్సరీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మీ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క నర్సరీ కూడా పెట్టకపోగా.. ఉన్న చెట్లను నరికేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు.. రూ.10వేల కోట్లకు కక్కుర్తిపడి %ంజఖ%లో జీవవైవిధ్యాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. ఐటీ ఉద్యోగాలను కూడా మూడు లక్షల నుంచి 9 లక్షలకు పెంచామని గుర్తు చేశారు.

శాంతిభద్రతల విషయంలోనూ కాంగ్రెస్ పనితీరు ఏంటో బయటపెట్టారు కేటీఆర్. బీఆర్ఎస్ హయాంలో సీసీ కెమెరాలు పెట్టి కేసీఆర్ హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పెంపొందిస్తే.. ఇప్పుడు సైబరాబాద్‌లో 41 శాతం, హైదరాబాద్‌లో 60 శాతం క్రైమ్ రేటు పెరిగిందని వెల్లడించారు. డే లైట్ మర్డర్లు పెరిగాయని అన్నారు. ఇదంతా ప్రభుత్వ వైఫల్యం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. మహారాష్ట్రలోని ముంబై పోలీసులు.. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకున్నారంటే అంతకంటే అవమానం ఉంటుందా అని అన్నారు.

ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూటిగా సవాల్ విసిరారు. దమ్ముంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో లెక్కలు చెప్పి ఓట్లు అడగాలని చాలెంజ్ విసిరారు. దీనిపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి తాము సిద్ధమని సవాల్ విసిరారు. చర్చించడానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్లేస్, టైమ్ వాళ్లు చెప్పినా సరే.. తమను చెప్పమన్నా సరే అని అన్నారు.. కమాండ్ కంట్రోల్ సెంటరైనా.. గాంధీభవన్ అయినా.. అసెంబ్లీలో చర్చ పెట్టినా తాము ఈ విషయాలపై చర్చించడానికి రెడీగా ఉన్నామని తేల్చిచెప్పారు.

మరోవైపు.. రేవంత్ రెడ్డి, మోదీ మధ్య మంచి ఫెవికాల్ బంధం ఉందన్నారు కేటీఆర్. తెలంగాణలో కాంగ్రెస్–బీజేపీ జాయింట్ ప్రభుత్వం నడుస్తోందని తెలిపారు. సీబీఐ, ఈడీ వంటి సంస్థలను రాహుల్ గాంధీ విమర్శిస్తే.. అదే సంస్థలను రేవంత్ నమ్ముతారని వెల్లడించారు. ఇక.. మైనార్టీలను అవమానించి నందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

. ఫార్ములా ఈ కేసులోనూ గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చినా, చార్జ్‌షీట్‌లో విషయం లేకపోవడం వల్ల దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసిందని తేల్చిచెప్పారు. తనపై చేసిన ఆరోపణల విషయంలో.. దమ్ముంటే ఈ ప్రభుత్వం తనను అరెస్ట్ చేయాలని చెప్పారు. అంతేకాకుండా.. తాను లై డిటెక్టర్ టెస్టుకు కూడా సిద్ధమే అని.. రేవంత్ రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. దీంతో ఎవరు దొంగనో తేలిపోతుంది కదా అని చెప్పారు. ప్రతి విషయంలోనూ పచ్చి అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మల్టీప్లెక్సుల్లో మండుతున్న ధరలు

(మొదటి పేజీ తరువాయి)

200 రూపాయల వద్ద ఉండాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో పాటు మరికొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధించింది. కానీ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అమ్మే ప్రతీ టికెట్‌కు సంబంధించిన ఆడిటబుల్ రికార్డ్స్ మెయిన్‌టేన్ చేయాలని ఆదేశం చింది. అంతేకాదు.. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు నిర్ణయంపై ఓ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహ్తా బెంచ్ తాజాగా విచారణ జరిపింది. ఇ÷చారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. 'మీరు వాటర్ బాటిల్‌కు 100 రూపాయలు, కాఫీకి 700 రూపాయలు తీసుకుంటున్నారు' అని అన్నారు. ఇందుకు మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరఫున కేసు వాదిస్తున్న అడ్వకేట్ ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 'తాజ్ హోటల్‌లో కాఫీకి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. మరి మీరు ఆ రేట్‌ను ఫిక్స్ చేస్తారా?' అని అడిగారు. ఇందుకు విక్రమ్ నాథ్ బదులిస్తూ.. 'ఈ రేట్లు స్థిరంగా ఉండాలి. సినిమా రంగం రోజురోజుకు దెబ్బ తింటోంది. ఇలాంటి సమయంలో జనం వచ్చి సినిమాను ఎంజాయ్ చేసేలా రేట్లు ఉండాలి. లేకపోతే సినిమా హాళ్లు ఖాళీగా ఉండాల్సి వస్తుంది' అని అన్నారు. ముకుల్ స్పందిస్తూ..'కర్ణాటక హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోమంటే ఎలా?. ఐడీ కార్డులు పెట్టుకుని థియేటర్లకు ఎవరు వస్తారు?' అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు
## ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్5(అక్షరగళం):జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

# బండి సంజయ్ మరో సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించు కున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి 'మోడీ గిఫ్ట్' పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోడీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్‌ను పంపిణీ చేయబోతున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పారిపోవడం కేటీఆర్‌కు అలవాటుగా ఉంది. కేసీఆర్ పదేళ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారా అని సీఎం ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ అభివృద్ధిపై చర్చలకు రావాలని సవాల్ విసిరారని.. ఆయనకు సవాల్ విసరడం పారిపోవడం అలవాటేనని సెటైర్లు గుప్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తాను సవాల్ విసిరితే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో ఢిల్లీలో తేల్చుకోవాలని ఛాలెంజ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్‌రెడ్డి చెప్పాలని



నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో అసలు బీజేపీనే లేదని దెప్పిపొడిచారు. ఇక్కడ బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని పేర్కొన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సెంటిమెంట్ పనికి రాదని విమర్శించారు. ఒకవేళ సెంటిమెంట్ అయితే పీజేఆర్‌పై పోటీ పెట్టింది బీఆర్ఎస్ కాదా..? అని అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌కి ఏం ఇచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని అభివర్ణించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఉద్ఘాటించారు.

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు

(మొదటి పేజీ తరువాయి)

యాదవ్ మాట్లాడారు. తాను చదువుకున్న వ్యక్తినని, ప్రజల కోసం నిజాయితీగా పని చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. గతంలో తమ గల్లీకి ఎమ్మెల్యే కూడా రాలేదని, ఇప్పుడు సీఎం వస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనను కుడి భుజంగా భావించడం తమ అదృష్టమని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి గతంలో కేసీఆర్‌కు సహాయం చేశారన్న నవీన్ యాదవ్, కేసీఆర్ తమ ఇంటికి వచ్చి సహాయం అడిగారని, శత్రువు ఇంటికి వచ్చినా సహాయం చేస్తామని నవీన్ యాదవ్ అన్నారు. 2018లో తనకు అవకాశం ఇవ్వకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని ఆయన విమర్శించారు. తనపై వస్తున్న విమర్శలను పట్టించుకోనని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఆధారంగా ఓట్లు అడగాలని ఆయన సూచించారు.

# బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ జరుగనున్న నియోజకవర్గాల్లో అందరి దృష్టి ప్రధానంగా వైశాలి జిల్లాలోని రఘోపూర్ అసెంబ్లీ నియోజకవర్గంపై ఉంది. ఇక్కడి నుంచి ఆర్జేడీ నుంచి 'మహాగఠ్ బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్నారు. రెండు సార్లు వరుసగా రఘోపూర్‌నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన హ్యాట్రిక్ విజయం కోసం బరిలో ఉన్నారు. గతంలో ఆ నియోజకర్గానికి తేజస్వి తండ్రి లాలూప్రసాద్ యాదవ్ రెండుసార్లు, తల్లి రబ్రీదేవి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరూ రఘోపూర్ నుంచి గెలిచే ముఖ్యమంత్రులు అయ్యారు. మహూవా నియోజకవర్గం కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా ఏర్పాటు చేసిన 'జన్‌శక్తి జనతా దళ్' నుంచి పోటీ చేస్తున్నారు. ఈ ఏడాది మొదట్లో ఆర్జేడీ నుంచి తేజ్ ప్రతాప్ బహిష్కరణకు గురయ్యారు. ఇటీవల జన్‌సురాజ్ కార్యకర్త దులార్ చంద్ యాదవ్ హత్యకు గురైన మొకామా నియోజకవర్గంలోనూ ఓటర్లు ఎవరికి పట్టం కడతారనే ఆసక్తి నెలకొంది. ఈ హత్య కేసులో అరెస్టయిన అనంత్ సింగ్ మొకామా నుంచి జేడీయూ టిక్కెట్‌పై పోటీలో ఉన్నారు. ఆయన తరఫున కేంద్ర మంత్రి లలన్ సింగ్ ప్రచారం చేశారు. కాగా, గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తారాపూర్ నియోజకవర్గంపైనా ఆసక్తి నెలకొంది. ఇక్కడి నుంచి ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి పోటీలో ఉన్నారు. గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తొలి విడత ఎన్నికల్లో 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. 3.75 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 50,000కు పైగా పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మహిళల కోసం 1,000కు పైగా ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసింది. ఓటర్ ఐడీ కార్డు లేకపోతే ఆధార్, పాన్, పెన్షన్ కార్డు, డ్రైవర్ లైసెన్స్ వంటి 11 పత్రాలు ఉపయోగించుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. భద్రత కోసం పోలీసులు, కేంద్ర బలగాలతో కలిపి 50,000 వేల మందిని మోహరించింది. డ్రోన్లు, సీసీటీవీల పర్యవేక్షణలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల పోరు ప్రధానంగా ఎన్డీయే, ఇండియా కూటమి మధ్యనే ఉంటుందనే అంచనా ఉండగా, ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ కూడా అన్ని స్థానాల్లోనూ పోటీకి దిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 8 సభల్లో పాల్గొనగా, రాహుల్ 14 సభల్లో, నితీష్ 41 సభల్లో, తేజస్వి అత్యధికంగా 96 సభల్లో పాల్గొన్నారు. కాగా, రెండో విడత పోలింగ్ 122 నియోజకవర్గాల్లో నవంబర్ 11న జరుగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

# పోక్సో కోర్టు సంచలన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

చిన్న కుమార్తెతో సహా అతనితో పారిపోయింది. ఆ తర్వాత డిసెంబర్ 2019 –అక్టోబర్ 2021 మధ్య ఈ ముగ్గురూ పాలక్కాడ్, మలప్పురం జిల్లాల్లో అద్దె ఇళ్లలో నివసించారు. ఈ సమయంలోనే ఆ వ్యక్తి బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లి కేవలం ప్రేక్షకురాలుగా ఉండటమే కాకుండా.. ఈ నేరాలకు సహకరించినట్లు నిర్ధారణ అయింది. ప్రాసిక్యూటర్లు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆ మహిళ తన కుమార్తెకు బలవంతంగా మద్యం తాగించి, బెదిరింపులకు పాల్పడిందని.. అమ్మాయి మెదడులో చిప్ అమర్చారని, నువ్వు ఈ దారుణాన్ని ఎవరికైనా చెబితే తమకు తెలిసిపోతుందని ఆ బాలికను భయపెట్టినట్లు ప్రాసిక్యూషన్ తెలిపింది. దీనితో కోర్టు ఇద్దరికి చెరో 180 ఏళ్ల జైలు శిక్షతో పాటు.. ఇద్దరు దోషులకు చెరో రూ.11.75 లక్షల జరిమానా కూడా విధించింది. ఒకవేళ జరిమానా చెల్లించడంలో విఫలమైతే వారి జైలు శిక్షకు మరో 20 నెలలు చేరుతుందని వెల్లడించింది. కోర్టు ఈ శిక్షను పేర్కొంటూ.. చట్టంలోని వివిధ నేరాలకు గాను నిందితులు ఏకకాలంలో అనేక 40 ఏళ్ల శిక్షలను అనుభవించాలని ఆదేశించింది. దీని ద్వారా మొత్తం శిక్ష 180 సంవత్సరాలుగా మారింది. బాధితురాలికి మద్దతుగా, నిందితుల నుంచి వసూలు చేసిన జరిమానాలను ఆ బాలికకు చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

## హరీష్ రావును పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ,నవంబర్ 05 (అక్షర గళం):** మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాదులోని హరీష్ రావు నివాసం వెళ్లి పరామర్శించి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు హరీష్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారు ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్ శారద భారతి తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో ఉజ్వల భవిష్యత్

**- పాపిశెట్టి రాము**

**ఆమనగల్లు, నవంబర్ 05 (అక్షర గళం):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము అన్నారు. కల్వకుర్తి పట్టణంలో బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్లో గతి పది రోజులుగా నిర్వహిస్తున్న కోకో శిక్షణ ముగింపు శిబిరానికి ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము బుధవారం హాజరయ్యారు. ఆర్గనైజర్ గోకమల్ల రాజు అయనను శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. క్రీడలతో మానసి కోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యత పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్ ఫోన్ లో ఆటలు ఆడటం కాకుండా మైదానంలో ఆటలు ఆడే విధంగా తయారు చేయాలన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ లు పూరంచంద్, ప్రకాష్, జగన్, సీనియర్ క్రీడాకారులు శ్రీశైలం, బాలరాజు, మహేష్ తదితరులు ఉన్నారు.

## ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడిగా పురుగుల శివ



**ఆమనగల్లు, నవంబర్ 05 (అక్షర గళం):** గ్రేటర్ హైదరాబాద్ ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడిగా ఆమనగల్లుకు చెందిన పురుగుల శివ నియమితులయ్యారు. చైతన్యపురిలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనను కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి పృథ్వీ తేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పురుగుల శివ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, ఏబీవీపీని మరింత పటిష్ట పరుస్తానని చెప్పారు. తనకు పదవి సహ కరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమనగల్లు ఏబీవీపీ నాయకులు ఆయనను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించారు.

## ఆలయాలకు కార్తీక శోభ


**ఆమనగల్లు, నవంబర్ 05 (అక్షర గళం):** పరమ పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆలయాలు దీప కాంతుల్లో వెలిగిపోయాయి. ఆమనగల్లు పట్టణంలోని పురాతన శివాలయం ఆలయంలో, శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ మాత ఆలయంలో, శ్రీ



వెంకటేశ్వరస్వామి ఆలయంలో, ఆంజనేయస్వామి ఆలయంలో, అంతరింతుర కొండ అభయాంజనేయ స్వామి ఆలయంలో, సాయిబాబా, బీసీ కాలనీ హనుమాన్ ఆలయంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన దీపోత్సవాలు కనుల పండువగా దర్శనమిచ్చాయి. వివిధ ఆకారాల్లో దీపాలు అలంకరించి వెలిగించారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవ, జ్వాల తోరణం ప్రవేశం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## మాజీ మంత్రి హరీష్ రావుని పరామర్శించిన మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, నవంబర్ 05, (అక్షర గళం):** మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి కీ.శే తన్నీరు సత్యనారాయణ రావు ఇటీవలే స్వర్గస్తులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి బుధవారం హరీష్‌రావుని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించి,



తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోష్ రెడ్డి, వీరేష్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.





## కీసరగుట్టలో కార్తీకమాసం

**శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు**

**కీసర, నవంబర్ 05 (అక్షర గళం):** కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వేకువజాముననే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. భక్తులు గంగాజలంతో స్వామివారికి అభిషేకాలు చేస్తూ హరహర శంభో నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగాలకు మహిళలు పాలాభిషేకాలు చేయగా,కుటుంబ సమేతంగా కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.భక్తుల రద్దీ



దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.శానిటేషన్, తాగునీటి సదుపాయం, భద్రతా చర్యలను బలోపేతం చేయడంతో భక్తులకు ఎటువంటి అంతరాయం లేకుండా దర్శనం జరుగుతోందని ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, కార్యనిర్వాహణ అధికారి కట్ట సుధాకర్ రెడ్డి తెలిపారు.ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ.. కార్తీకం మాసం అంటే శివుడికి ఇష్టమైన మాసం అని అన్నారు. లింగంపై నీళ్ళు పోసి అభిషేకం చేస్తే మంచిదని చెప్పారు. కార్తీక మాసంలో భక్తులు ఆలయ పరిసర ప్రాంతంలో దీపాలు వెలిగిస్తే అంత మంచి జరుగుతుందని అన్నారు.

## ఆటో డ్రైవర్ ఆత్మాహుతియత్నం.. చికిత్స పొందుతూ మృతి

**కాప్రా,నవంబర్ 5 (అక్షర గళం):** కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడి మరణించిన ఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో చిక్కు కోవడంతో మనస్తాపానికి గురై ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి:భగత్ నగర్, జమ్మిగడ్డ జవహర్ నగర్‌కు చెందిన సింగిరెడ్డి మీన్ రెడ్డి (32) అద్దె ఆటో (నంబర్ ఏపి 28 వై 1789) నడుపుతూ జీవనోపాధి సాగించేవాడు. తేదీ: 04.11.2025 మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో రాధికా ఎక్స్ రోడ్ వద్ద కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ డ్రైవ్ చెకింగ్‌లో మద్యం సేవించి అక్రమంగా వాహనం నడిపినట్టుగా గుర్తించారు. దీంతో అతను నడుపుతున్న ఆటోను సీజ్ చేసి, "నీ తరఫున మద్యం సేవించని వ్యక్తి వస్తే ఆటో అప్పగిస్తాం" అని పోలీసులు తెలిపారు.

ఈ సంఘటన తర్వాత తీవ్ర మనస్తాపానికి గురైన మీన్ రెడ్డి రాత్రి సుమారు 10.20 గంటల సమయంలో ట్రాఫిక్ స్టేషన్ దగ్గరే పెట్రోల్ పోసుకొని నిప్పు పెట్టుకున్నాడు. దీనిని గమనించిన పక్కవారు, పోలీసులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి



గాంధీ ఆసుపత్రికి తరలించారు.

అయితే గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతను తేదీ: 05.11.2025 ఉదయం 5.10 గంటల సమయంలో చికిత్స పొందుతూ మరణించాడు. మద్యపాన అలవాటు, ఆర్థిక ఇబ్బందులు కారణం మీన్ రెడ్డి దీర్ఘకాలంగా మద్యానికి బానిసై ఉందని, అద్దెకు తీసుకున్న ఆటోను పోలీసులు సీజ్ చేయడంతో యజమాని అడుగుతాడేమోనన్న భయంతో మనోవేదనకు గురై ఆత్మాహుతికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై మల్కాజ్గిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అన్నదాన ప్రభువే.. శరణమయ్యప్ప..

- మాలధారులకు నిత్య సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్
- ప్రతిరోజు 300 నుంచి 350 మందికి భిక్ష
- 60 రోజుల పాటు నిత్య అన్న ప్రసాద కార్యక్రమం
- మొదటి రోజు ప్రారంభించిన డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా

**ఆమనగల్లు, నవంబర్ 05 (అక్షర గళం):** నియమ నిష్టలతో చేసే అయ్యప్ప దీక్ష మనిషి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తుందని, మండల కాలం 41 రోజుల పాటు దీక్షలో ఉన్న భక్తుడు దీక్ష తర్వాత కూడా దుర్గుణాలను వదిలి సన్మార్గంలో నడిచేలా చేస్తుందని, అందుకే పరమ పవిత్రమైన అయ్యప్ప దీక్ష తీసుకునే భక్తుడినే దేవుడిగా భావిస్తుంటారని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కడ్తాల్ పట్టణ శివాలయ ఆవరణలో అయ్యప్ప మాల ధరించిన స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఆ ఆవరణ అంతా అయ్యప్ప



నామస్మరణతో మారు మోగింది.. డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్, కడ్తాల సింగల్ విండో చైర్మన్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్య అన్న ప్రసాద (భిక్ష) కార్యక్రమాన్ని స్వాములతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 12:30 నిమిషాల నుంచి 3:30 వరకు భిక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి మానవుడు చెడుకు దూరంగా ఉంటూ.. భక్తి భావం పెంపొందించుకోవాలని సూచించారు. గత 10 సంవత్సరాలుగా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అయ్యప్ప మాలదరణ స్వాములే కాకుండా ఆంజనేయ ఇతర మాల ధరించిన స్వాములకు నిత్య అన్న ప్రసాద (భిక్ష) కార్యక్రమాన్ని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ శ్రీకారం చుట్టారన్నారు. నవంబర్ 5 నుంచి ప్రారంభమైన నిత్య అన్న ప్రసాద (భిక్ష) కార్యక్రమం 60 రోజులపాటు దిగ్విజయంగా కొనసాగించేందుకు గంప లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ గుప్తా ముందుకు వచ్చి పది సంవత్సరాలు పూర్తయింది అన్నారు. ప్రతిరోజు వివిధ మాల ధారణ స్వాముల కోసం భిక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేసి ఆశీర్వదించాలన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్, నవీన్ వారి కుటుంబ సభ్యులు, గురు స్వాములు భీముడు విజయ్, సైదులు, రాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ సమగ్రాభివృద్ధి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, నవంబర్ 05 (అక్షర గళం):** కాంగ్రెస్ తోనే జూబ్లీహిల్స్ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం యూసుఫ్ గూడా డివిజన్ లోని వెంకటగిరిలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరియు ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్



నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అన్ని వర్గాల ప్రజల కోసం పని చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ళు రాష్ట్రాన్ని పాలించి నాటి సీఎం కేసీఆర్ కుటుంబం, ఆయన మంత్రులు రాష్ట్రాన్ని యథేచ్ఛగా దోచుకున్నారన్నారు. మరోవైపు బీజేపీ కుల



ప్రాతిపదికపైన పరిపాలించే పార్టీ అని ఆయన అన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాల కారణంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు వచ్చాయన్నారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అంతిమ విజయమని, విపక్షాలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, మాజీ సర్పంచ్లు ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, కడమోని శ్రీశైలం, డైరెక్టర్ చేగురి వెంకటేష్, వెంకట్ రెడ్డి, అంజన్ రెడ్డి, మహేందర్ గౌడ్, పర్వతాలు, శ్రీను నాయక్, గాజుల రమేష్, కాలే మల్లయ్య, విజయ్ నాయక్, హరిలాల్, పులికంటి మైసయ్య, రామక్రిష్ణ, పత్య నాయక్, జైపాల్, బద్ది వెంకటేష్, రాజ్య నాయక్, పత్య తదితరులు పాల్గొన్నారు.

### నవీన్ కుమార్ యాదవ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం

కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శతబ్ది టౌన్ షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం జూబ్లీహిల్స్ యూసుఫ్ గూడ 224 వెంకటగిరి కాలనీలో ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నవీన్ కుమార్ యాదవ్ గారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, అంబటి బిక్షపతి, అంబటి శ్రీను, తుమ్మల కృష్ణ, రఘుపతి, జూబ్లీహిల్స్ నాయకులు మన్సూర్, రహమత్ ఖాన్, రమేష్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.





# చినుకు పడితే చిత్తడే..

వెల్దండ, నవంబర్ 05 (అక్షర గళం): వెల్దండ మండల పరిధిలోని చొక్కన్న పల్లి గ్రామంలో వర్షాకాలం రోడ్డుపై నిలిచిన నీరు ప్రజలు రోడ్డుపై నడవలేని దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వాహనదారులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. వర్షా కాలం ప్రారంభమైతే చాలు రోడ్లన్నీ చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రోడ్లపై వర్షపు నీలవడంతో దోమలకు ఆవాసాలుగా మారి సీజనల్ వ్యాధులు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వర్షం నీరు నిల్వ ఉండడం, మురుగు నీరు ఇళ్ల మధ్యలో చేరడంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాకాలం దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని, రోడ్లు, డ్రెయినేజీ నిర్మించేలా చొరవ చూపాలని చొక్కాన్న పల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, నవంబర్ 05, (అక్షర గళం): సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. బుధవారం గాజుల రామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్ – ఏ నూతన సంక్షేమ సంఘం సభ్యులు చింతల్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నగర్ నూతన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువతో సత్క రించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమ సంఘాలు ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలన్నారు. అభివృద్ధి అనేది నిత్యం జరిగే ప్రక్రియని కాలనీలో ఏదైనా సమస్యలు ఉంటే పరిష్కరించడంలో నూతన సంక్షేమ సంఘానికి నా మద్దతు ఎప్పుడూ ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, తెలంగాణ సాయి, చందు ముదిరాజ్, నూతన అధ్యక్షులు చంద్ర గౌడ్, ప్రధాన కార్యదర్శి రజాక్, ఉపాధ్యక్షులు వీరేష్ గౌడ్, అజ్మత్, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రాజలింగం గౌడ్, ఆంజనేయులు, కిషోర్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ శిరిడి సాయిబాబా దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పూజలు

**కార్తీక పౌర్ణమి పూజలో పాల్గొన్న నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి**

కీసర, నవంబర్ 05, (అక్షర గళం): నాగారం మున్సిపాలిటీలో సత్యనారాయణ కాలనీ శ్రీరామ సహిత సత్య నారాయణ స్వామి మరియు శ్రీ శిరిడి సాయిబాబా దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తిపూర్వకంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపదానం చేసి స్వామి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయఅభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ అన్నం రాజు శ్రీనివాస్, అన్నం రాజు సురేష్, సలహాదారులు వెంకట రత్నం, చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి బి.నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కందాడి శ్రీనివాస్ రెడ్డి, ముక్కెర కరుణాకర్ రెడ్డితో పాటు సాయిలు, రెడ్యానాయక్, భద్రు నాయక్, సాయిగౌడ్, అభిలాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

**హుస్సేన్ సాగర్‌లో లభించిన శవాలను గుర్తించిన పోలీసులు**

హైదరాబాద్, నవంబర్ 5 (అక్షరగళం): కుటుంబ కలహాలతో వివాహిత తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే గుర్తు తెలియని శవంగా పోలీసులు భద్రపరిచారు. చివరకు దర్యాప్తులో ఆమెను కీర్తిక అగర్వాల్‌గా గుర్తించారు. లేక్ పోలీసుల వివరాలప్రకారం..పాతబస్తీలో నివాసముంటూ వ్యాపారం చేస్తున్న పృథ్వీలాల్, చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కీర్తిక అగర్వాల్(28) దంపతులు. వీరికి రెండేళ్ల కుమార్తె బియ్యారా ఉంది. దంపతుల మధ్య గొడవలతో ఆమె ఏడాదిన్నర కిందటే బహదూర్‌పురలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్ద కుమార్తెతో కలిసి ఉంటోంది. ఈనెల 2న హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు లభ్యం కాకపోవడంతో మార్చురీకి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమ కుమార్తె, మనుమరాలు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కీర్తిక అగర్వాల్‌గా గుర్తించిన ఆమె తల్లిదండ్రు లకు సమాచారం అందించారు. ఆమె తన కుమార్తెతో కలిసి ఆత్మ హత్యకు పాల్పడి ఉంటుందని భావించి పరిశీ లించగా మంగళవారం పాప మృతదేహాన్ని గుర్తించారు.



# మైసిగండి దేవస్థానానికి కల్వకుర్తి మాజీ జెడ్పీటిసి డా.విజితా రెడ్డి దంపతులు రూ.25,000/- విరాళం అందజేత

వెల్దండ, నవంబర్ 05 (అక్షర గళం): కార్తీక పౌర్ణమి సందర్భంగా కల్వకుర్తి మాజీ మార్కెట్ చైర్మన్ వెల్దండ మాజీ జెడ్పిటిసి దంపతులు డాక్టర్ విజితా రెడ్డి ఆనంద్ రెడ్డి కడ్తాల్ మండలం మైసిగండి లో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అభిషేక నిర్వహించారు అనంతరం మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల సందర్భంగా మైసిగండి దేవాలయానికి తన వంతుగా 25వేల రూపాయలు విరాళం అందించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు దంపతులను ఘనంగా శాలువతో సన్మానించారు ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని సందర్భంగా పురస్కరించుకొని మైసిగండి మైసమ్మ తల్లి శివాలయం ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకోవడం జరిగిందని అని అన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్తీక పౌర్ణానికి వచ్చి దర్శించుకోవడం జరుగుతుందని అన్నారు.




మైసిగండి మైసమ్మ అమ్మవారిని దయ వల్ల ప్రజలు రైతులు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ జెడ్పిటిసి డాక్టర్ విజితా రెడ్డి అన్నారు.




# గుండాల శివాలయాన్ని దర్శించుకున్న అదనపు కలెక్టర్ దంపతులు

వెల్దండ, నవంబర్ 05 (అక్షరగళం): వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి వారి ఆలయాన్ని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ దంపతులు దర్శించుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ దంపతులు శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి, అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు శివకుమార్ శర్మ, సంతోష్, నరహరి, సురేష్ శర్మ, కల్వకుర్తి కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత రెడ్డి, బొల్లంపల్లి ఎంపీటీసీ చల్లా వెంకట్ రెడ్డి ఆలంపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కమిటీ.!

వెల్దండ, నవంబర్ 05 (అక్షర గళం): తెలంగాణ రాష్ట్ర డీజీపి శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని వెల్దండ ఎస్సై కురుమూర్తి పేర్కొన్నారు. జాతీయ రహదారు లపై రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో రోడ్డు భద్రతలో భాగంగా వెల్దండ మండలంలో శ్రీశైలం ప్రధాన రహదారిపై వున్న రాఘయిపల్లి పెద్దాపూర్, వెల్దండ మరియు కొట్ర గ్రామాల లోని పెద్ద మనుషులు, విశ్రాంత ఉద్యోగులు, యువకులు మరియు స్త్రీలతో విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా వెల్దండ మరియు కొట్ర గ్రామాలలో కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీలకు వారు నిర్వహించవలసిన విధుల గురించి ఎస్సై వివరించడం జరిగింది.




**కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశాలు**

ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం

రోడ్డు ప్రమాదాల సమయంలో పోలీస్ శాఖతో సమన్వయం చేయడం

రహదారుల నాణ్యత, మరమ్మతులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని అందించడం కొరకు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సై కురుమూర్తి పేర్కొన్నారు.



# యూపిలో పట్టాలు దాటుతుండగా ఘోరం

**రైలు ఢీకొని నలుగురు యాత్రికుల దుర్మరణం**

లక్నో,నవంబర్5(అక్షరగళం): ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మిర్జాపుర్‌లో బుధవారం రైల్వే పట్టాలు దాటుతున్న యాత్రికులను ఓ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందినట్లు తెలుస్తోంది. కార్తిక పౌర్ణమి నేపథ్యంలో యాత్రికులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాత్రికులు చోపాన్–ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలులో చునార్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వారు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం పైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ట్రాక్ పైకి వచ్చిన హౌరా–కల్కా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో సిసిఐ నిబంధనలు

**బిజెపి ఎంపి నగేశ్ ఇంటిని ముట్టడించిన బిఆర్ఎస్**

ఆదిలాబాద్,నవంబర్5(అక్షరగళం): పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ వైఖరిని నిరసిస్తూ బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ ఎంపీ నగేష్ ఇంటి ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎంపీ నగేశ్ ఇంటి ముందు బైఠాయించారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకు దిగిన మాజీ మంత్రి తోపాటు బీఆర్ఎస్ నాయకులు పోలీసులు అరెస్టు చేశారు.



ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. సీసీఐ తేమ పేరిట పత్తి కొనుగోళ్లను నిరాకరిస్తూ రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. తేమతో సంబంధం లేకుండా సీసీఐ పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వర్షాలకు కారణంగా రైతులు పత్తి పంటను నష్టపోగా సీసీఐ పరిమితులు విధించడం సరికాదని అన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ల కాకుండా 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పత్తికి సుంకం తగ్గించి కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా ఖండించారు.

# జూబ్లిహిల్స్ ప్రచారంలో రేవంత్ రెడ్డిపై నిషేధం విధించాలి

**- సీఎం ఇస్లాం మతాన్ని,ముస్లింలను అవమానించారు**

**- రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి.**

**- బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగిలిన మూడు రోజులు పాల్గొనకుండా ఆయనపై నిషేధం విధించాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో మాట్లాడుతూ,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ రోజు బిఆర్ఎస్ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రధాన ఎన్నికల కమీషన్ అధికారిని కలవడానికి బిఆర్కె భవన్ వెళ్లారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపుతామని తెలిపారు.

మాజీ మంత్రి, ప్రతిపక్ష పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత దుషణకు పాల్పడ్డారన్నారు. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమావళికి విరుద్దమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఆరోపించారు. అంతేకాకుండా ఇస్లాం మతం గురించి,ముస్లిం పై అవమానకరంగా మాట్లాడరని గుర్తుచేశారు.

1400 ఏళ్ల చరిత్ర ఉన్న ఇస్లాం మతాన్ని అవమానకరంగా దూషించారన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ముస్లింలకు ఎంతో కొంత పరువు ఉన్నదని, లేకుంటే లేదని,కాంగ్రెస్ పార్టీ లేకపోతే ముస్లింలే లేరని అహంకారపూరితంగా మాట్లాడారని మండి పడ్డారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఒక మతాన్ని ,మత విశ్వాసాలను అవమానించడం సరైంది కాదన్నారు. వ్యక్తులను కించపరిచేలా,మతాన్ని లేదా మత విశ్వాసాలను కించపరిచే వ్యాఖ్యలు ఎవరు చేసినా ఎన్నికల సంఘం ఉపేక్షించవద్దని డిమాండ్ చేశారు. అలాంటి వ్యక్తులు ఎంతటివారైనా వారిని ప్రచారం చేయకుండా నిషేధించాలని ఎన్నికల కమీషన్ అధికారులను కోరారు.

ఇలాంటి వ్యక్తిపై ఇప్పటికే ఎన్నికల కమీషనర్, కేంద్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసి ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లు సృష్టించిందని ఫిర్యాదు చేస్తే ఇప్పటికీ ఒక్క ఓటు కూడా ఎందుకు తొలగించలేదని ఎన్నికల కమీషన్ తీరును తప్పుబట్టారు.

ఇప్పటికైనా రేవంత్ రెడ్డిని ప్రచారానికి హాజరు కాకుండా నిషేధం విధించకపోతే ఎన్నికలు సజావుగా సాగవన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగి,మతకల్లోలాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా ఎన్నికల కమీషన్ పై నమ్మకం కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు.

భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఒక మత విశ్వాసాలను విమర్శిస్తూ మాట్లాడడం తీవ్రమైన నేరం అయినందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్,గెల్లు శ్రీనివాస్ యాదవ్,తుంగ బాలు,మాజీ బిసి కమీషన్ సభ్యులు కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి వీధి రౌడీ, గూండా అనుకుంటున్నాడా?

**- మంత్రివర్గం అంతా పల్లీ బఠానీలే.**

**కొండా విశ్వేశ్వర్ రెడ్డికి షార్ట్ టర్మ్ మెమోరీ లాస్**

**- ఆయనకు ఇంగిత జ్ఞానం ఉందా?**

**- టీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి, ..మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, మాజీ ఎ మ్మెల్యే మెతుకు ఆనంద్**




హైదరాబాద్: చేవెళ్ల బస్ ప్రమాదం విచారకరం. ఏ సమయంలో ఏం మాట్లాడాలో మాకు ఇంగిత జ్ఞానం ఉంది. బీజాపూర్ జాతీయ రహదారి 2021లో మంజూరు అయింది. కొంత మంది మర్రి చెట్లు కాపాడాలని ఎన్జీటీని ఆశ్రయించారు. ఎన్జీటి నుంచి స్టే ను ఉపసంహరించే ప్రయత్నం చేయాలని రెండేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ప్రాజెక్ట్ డైరెక్టర్ నివేదిక ఇవ్వకపోగా టైం పాస్ చేశారు.

ప్రపోజల్స్ ఎన్జీటికి సబ్మిట్ చేసి ఉంటే వర్క్ స్టార్ట్ అయ్యేది.రెండేళ్లు కాలయాపన చేశారు. మేము రాజకీయాల కోసం మాట్లాడటం లేదు. స్పీకర్, ముఖ్యమంత్రి ఈ రోడ్డు నుంచే వెళతారు. వాళ్లకు బాధ్యత ఎంత ఉందో అర్థం అవుతోంది. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి షార్ట్ టర్మ్ మెమోరీ లాస్ ఉంది. చనిపోయిన కుటుంబాలు రోదిస్తుంటే రాజకీయాలు మాట్లాడుతున్నారు. ఆయనకు ఇంగిత జ్ఞానం ఉందా?

బిఆర్ఎస్ ను విమర్శిస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి...రెండేళ్లుగా ఎంపీగా ఉండి ఏం చేశారు? బీజేపీని ప్రజలు నమ్మకపోవటానికి కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటివాళ్లే కారణం

ఈ ప్రభుత్వానికి మానవత్వం ఉందా.?: ముఖ్యమంత్రికి జూబ్లీహిల్స్ ఎన్నిక మీద ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాల మీద లేదు. బస్ ప్రమాదంలో చనిపోయిన వాళ్లను టోయింగ్ వాహనంలో తీసుకువెళతారా? ఈ ప్రభుత్వానికి మానవత్వం ఉందా.? చెట్లను కాపాడటం ముఖ్యమా? మనుషుల ప్రాణాలు ముఖ్యమా?.

రోడ్లు బాగాలేక వికారాబాద్ నియోజకవర్గానికి పిల్లను ఇవ్వటం లేదన్న స్పీకర్ రెండేళ్లుగా ఏం చేస్తున్నారు?.ముఖ్యమంత్రి వీధి రౌడీ, గూండా అనుకుంటున్నాడా?ఏం భాష మాట్లాడుతున్నాడు? మంత్రివర్గం అంతా పల్లీ బఠానీలే. బస్ ప్రమాదంలో తాండూరుకు చెందిన 12 మంది చనిపోవటం బాధాకరం. ఘటన జరిగి రెండు రోజులవుతున్నా కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరు బాధిత కుటుంబాలను కలవలేదు? ముఖ్యమంత్రికి రాజకీయాలు, ఓట్లు తప్ప ప్రజలపై ప్రేమ లేదు. కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పిచ్చి పీక్ స్టేజ్ కు వెళ్లింది. రోడ్డు పనులు వెంటనే మొదలుపెట్టకపోతే తాండూరు, వికారాబాద్ నుంచి పాదయాత్రగా వచ్చి సెక్రటేరియట్ ను ముట్టడిస్తాం.

## బీజేపీకి ఒక నిబంధన

# బీఆర్ఎస్‌కి మరో నిబంధనా?

**-అప్పుడు తెలంగాణలో ఎన్నికల ముందు రైతుబంధును ఎలా ఆపేశారు?**

**- ఇప్పుడు ఎన్నికల ముందు బీహార్‌లో సీఎం మహిళా పథకానికి నిధులకు ఎలా అనుమతించారు?**

**- ఎన్నికల సంఘం ఎవరివైపు?**

**- ఎన్నికల సంఘం ద్వంద్వ వైఖరిని బహిర్గతం చేసిన బీఆర్ఎస్ సీనియర్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు మరియు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు ఎన్నికల నియమావళి అమలులో భారత ఎన్నికల సంఘం (EC) ప్రదర్శించిన ద్వంద్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. బీహార్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి మహిళా ఉద్యోగ యోజన కింద ?10,000 మహిళల ఖాతాల్లో జమ చేయడానికి ఎన్నికల సంఘం అనుమతివ్వడం శోచనీయం

కానీ తెలంగాణలో 2018 నుంచే కొనసాగుతున్న రైతు బంధు పథకంను గత ఎన్నికల సమయం లో ఆపివేయడం ం ఎన్నికల సంఘం రాజకీయ పక్షపాతం మరియు అన్యాయాన్ని బహిర్గతం చేస్తుంది అన్నదానికి ఉదాహరణ అని ఆయన అన్నారు.

ఎన్నికల కోడ్ మధ్యలో కొత్త పథకానికి అనుమతి అనుమతిని ఇవ్వడం బీజేపీకి లాభం చేకూర్చడానికే అని విమర్శించారు. ఎన్నికల నియమావళి అక్టోబర్ 8న అమల్లోకి రాకముందు కేవలం 12 రోజుల ముందు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2025 సెప్టెంబర్ 26న ముఖ్యమంత్రి మహిళా ఉద్యోగ యోజనను ప్రారంభించారు. అయినా కూడా ఎన్నికల సంఘం ఓటింగ్‌కు నాలుగు రోజుల ముందు ఈ పథకం కింద ?10,000 మహిళల ఖాతాల్లో జమ చేయడానికి అనుమతి ఇవ్వడం మీద విస్మయం వ్యక్తం చేశారు.

ఇది ఎన్నికల నియమావళి ఉద్దేశాన్ని పూర్తిగా తుంచేసిన చర్యగా, కేవలం బీజేపీకి ఎన్నికలలో ప్రయోజనం కల్పించడానికే తీసుకున్న నిర్ణయంగా అని అన్నారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయం లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలసి ఎన్నికల సంఘంపై ఒత్తిడి తెచ్చి "రైతు బంధు" ఆపించిన విషయం సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు ఈ సందర్భంగా గుర్తు చేశారు .

2023లో ఇదే ఎన్నికల సంఘం, బీజేపీ–కాంగ్రెస్ కలసి తెచ్చిన ఒత్తిడి ఫలితంగా, తెలంగాణ ప్రభుత్వాన్ని రైతు బంధు పథకం నిధుల విడుదలపై నిలిపివేసింది. కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు ఆధారంగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో, ఎన్నికల సంఘం 2018 నుంచే కొనసాగుతున్న రైతు బంధు పథకాన్ని నిలిపివేయడం, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో దెబ్బతీయడానికే ఉద్దేశించిన చర్య అని ఆయన స్పష్టంచేశారు

ఇప్పుడు అదే ఎన్నికల సంఘం, కొత్తగా ప్రారంభించిన పథకాన్ని బీహార్ రాష్ట్రంలో అనుమతించడం ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని స్పష్టమైన సాక్ష్యం అని తెలిపారు."ఒకే అంశంపై రెండు రాష్ట్రాలకు రెండు విధాల నిర్ణయాలు తీసుకోవడం, ఎన్నికల సంఘం నిష్పక్షపాత వైఖరిని పూర్తిగా కోల్పోయింది అనడానికి సంకేతం. ఇది రాజ్యాంగబద్ధమైన సంస్థ తన గౌరవాన్ని దిగజార్చిన చర్య," అని తెలిపారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన ఎన్నికల సంఘం, ఇప్పుడు రాజకీయ ఒత్తిడి కింద పనిచేస్తున్నట్టుగా కనిపిస్తోందని వెల్లడించారు."ఇది సాధారణ పొరపాటు కాదు ం ఇది భారత ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి," అని తెలిపారు.

ఒక పార్టీకి ఎన్నికల మధ్యలో పథకం అమలుకు అనుమతిస్తూ, మరో పార్టీకి నిషేధం విధించడం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అని అన్నారు. "ఇలా ఎన్నికల సంఘం రాజకీయ పక్షాల ఆదేశాలపై పనిచేయడం వల్ల స్వతంత్ర సంస్థలపై ప్రజల నమ్మకం దెబ్బతింటోంది," అని హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకో... బీజేపీ ఏ వ్యవస్థల్ని సొంతానికి వాడుకోదు!

**ఎంపీ రఘునందన్ రావు**

హైదరాబాద్: "దొంగనే దొంగ, దొంగనే దొంగ" అని అరిచినట్టుగా, కాళేశ్వరం కేసులో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న హడావుడి చూస్తుంటే అలానే అనిపిస్తోందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఈ మేరకు ఆయన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం విలేఖర్లతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే...

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకల కేసులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే, "రెండు నెలలలోపే విచారణ చేసి, కాజేసిన లక్ష కోట్ల సొమ్మును కక్కిస్తాం" అని ప్రగల్భాలు పలికింది. కానీ అధికారంలోకి వచ్చిన 23 నెలల తర్వాత, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగుతున్నారు ం "బీజేపీ ఎందుకు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం లేదు?" అని. రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకో..! భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ కూడా... గతంలో గానీ, భవిష్యత్తులో గానీ ం ఏ వ్యవస్థల్నీ తన సొంత ప్రయోజనాల కోసం వాడుకోలేదు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, సీబీఐని తన కక్షపూరిత రాజకీయాల కోసం వాడుకున్న సంగతి దేశానికి తెలిసిందే. అప్పట్లోనే ప్రతిపక్ష నేతలంతా




సీబీఐని "కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్" అని పిలిచారు. అది రేవంత్ రెడ్డి మర్చిపోయినట్టు కనిపిస్తోంది. కాని భారతీయ జనతా పార్టీ ఏనాడు కూడా అలా వ్యవహరించలేదు. భారతీయ జనతా పార్టీ కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉంటుంది. తప్పు చేసిన వారి పట్ల చట్టం తన పని తాను చేసుకు వెళ్తుందని మేము నమ్ముతాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు సీబీఐ, సీబీసీఐడీ, లేదా ఇతర ఏజెన్సీలను దుర్వినియోగం చేసే పని బీజేపీ ఎప్పుడూ చేయదు. బీజేపీ న్యాయ వ్యవస్థకు సంపూర్ణ గౌరవం ఇస్తుంది. ఆ సంస్థలు స్వతంత్రంగా పనిచేసేలా పూర్తి స్వేచ్ఛను కల్పిస్తుంది.




# చినుకు పడితే చిత్తడే..

- **బురదమయంగా మారిన రోడ్లు**
- **ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు**

ఆమనగల్లు, నవంబర్ 05 (అక్షర గళం): ఆమనగల్లు పట్టణంలో గల కాలనీల రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు, వాహనదారులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభమైతే చాలు రోడ్లన్నీ చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లు మినహా మిగిలిన రోడ్లన్నీ వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపై వర్షపు నీలవడంతో దోమలకు ఆవాసాలుగా మారి సీజనల్ వ్యాధులు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వర్షం నీరు నిల్వ ఉండడం, మురుగు నీరు ఇళ్ల మధ్యలో చేరడంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాకాలం దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని, రోడ్లు, డ్రెయినేజీ నిర్మించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

## రోడ్ల సౌకర్యం కల్పించాలి

పట్టణంలోని వివిధ కాలనీలకు రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలి. వర్షాకాలం రోడ్లపైనే నిలిచి బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపైనే నడవలేని దుస్థితి నెలకొని ఉంది. వాహనాలపై వెళ్లాలంటే భయపడాల్సి వస్తుంది. కాలనీల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలి.



**-ఏం.ఏ ఖలీల్,**
**బి ఆదర్శ నగర్ కాలనీ నివాసి**





## ఎన్డీఏ కోటి వరాల

# హామీలు బూటకం!

**- ఒక్కసారి మహాగర్ బంధన్‌కు అవకాశం ఇవ్వండి**

**- తెలంగాణ మోడల్ పాలన అందిస్తాం**

**- బీహార్ ప్రజలకు పొంగులేటి పిలుపు**

**- కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో కలిసి బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి**

హైదరాబాద్: రెండు దశాబ్దాల పాటు అవినీతి అక్రమాలు అవకాశవాద రాజకీయాలతో బీహార్ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని బీహార్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపారన్ జిల్లా చనుపటియా అసెంబ్లీ నియోజకవర్గం లో బుధవారం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తో కలిసి మంత్రి పొంగులేటి ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్డీయే కూటమికి ఓటమి భయం పట్టుకుందని అందువల్లే అలవికాని హామీలను ఇస్తుందని విమర్శించారు. వారి ఎన్నికల ప్రణాళికలో కోటి వరాలు ప్రకటించడం, యువతకు కోటి ఉద్యోగాలు, కోటి మంది లక్‌పతి దీదీలు హామీలు ఇచ్చారని అధికారంలో ఉన్న ఈ 20 సంవత్సరాలలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు, ఎంతమంది దీదీలను లక్ పతులుగా చేశారని ప్రశ్నించారు. అధికా రంలో ఉన్నప్పుడు ఎందుకు వీటిని అమలు చేయలేదని ప్రశ్నించారు.

బీహార్ ప్రజలను కొత్త హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహాగర్ బంధన్‌ను గెలిపిస్తే తెలంగాణ మోడల్ పాలనను బీహార్‌లో అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని వివరించారు.

రైతులకు రుణమాఫీ , 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయిలకే సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. బీహార్ ప్రజలు ఈ సారి విజ్ఞతతో ఆలోచించి మహాగర్ బంధన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

మహాగర్ బంధన్‌ను గెలిపిస్తే యువకుడైన తేజస్వియాదవ్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయాన్ని ప్రకటించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. ఈ బహిరంగ సభలో బీహార్ రాష్ట్ర ఇన్‌ఛార్జి కృష్ణ అల్వార్, ఎంజీబీ అభ్యర్థి అభిషేక్ రంజన్, తదితరులు పాల్గొన్నారు.

# దండుపాళ్యం ముఠా మొత్తం జూబ్లీహిల్స్‌లో ఉంది

**- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఓటర్లను బెదిరించే విధంగా సీఎం మాట్లాడుతున్నారు. ఏ ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఓటర్లను భయపెట్టలేదు. బోరబండలో కాంగ్రెస్ వేధింపులు తట్టుకోలేక సర్దార్ అనే బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నారు. వ్యాపారాలు ఉన్న బిఆర్ఎస్ నేతలను బెదిరిస్తున్నారు. కాంగ్రెస్ అధికార దుర్వినియోగం చేస్తోంది. బిఆర్ఎస్ కార్యకర్త రియాజ్ ఇళ్ళు కూలగొట్టి దాడి చేశారు.

నిరుద్యోగులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచారం చేస్తే వారిపై దాడి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్వయంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ సీఎం రేవంత్ రెడ్డిని ఫాలో అవుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తమ్ముడు చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ గా వున్నారు.నేర చరిత్ర ఉన్న వ్యక్తిని చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ గా ఎన్నికల సంఘం ఎట్లా అనుమతి ఇచ్చింది?

బాంబుల మంత్రి బీహార్ లో మిగిలిన 30వేల కుక్కర్లను పంచాలని చూస్తున్నారు. అధికారులు,పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఎట్లా ప్రవర్తిస్తున్నారో గుర్తు పెట్టుకుంటున్నాం. సీఎం రేవంత్ రెడ్డి దిగజారి మాట్లాడారు. రేవంత్ రెడ్డి తాను మున్సిపల్ శాఖామంత్రి,హెూంమంత్రి అనే విషయాన్ని మర్చిపోయారు. హైదరాబాద్ ను మురికి నగరంగా రేవంత్ రెడ్డి మార్చారు.

డీసీపీ మీద దాడులు చేసే పరిస్థితి హైదరాబాద్ లో వచ్చింది. ఓటమి భయం సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తోంది. అసహనంతో



సీఎం రేవంత్ రెడ్డి కేటిఆర్ ను తిడుతున్నారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఉప ఎన్నికల్లో వారం రోజులు ప్రచారం

చేయడం తొలిసారి. దండుపాళ్యం ముఠా మొత్తం జూబ్లీహిల్స్ లో ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపైనే సీఎం,మంత్రులు దృష్టి పెట్టారు. కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఓటర్లు కర్రు కాల్చి వాత పెట్టాలి. ప్రెస్ మీట్ లో గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,చాడ కిషన్ రెడ్డి ,ఆజం అలీ , ముఖీబ్ చాందా , ముసి ముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# సంపాదకీయం..

## అభినందనలు కాదు...ప్రోత్సాహం అందించండి !

మనదేశంలో క్రీడల్లో గెలిచాకనే అభినందనలు, ప్రశంసలు వెల్లువెత్తుతాయి. కానీ ఆడుకోవడానికి పాఠశాల స్థాయిలో లేదా కాలేజీ స్థాయిలో ప్రోత్సాహం మాత్రం అంతంత మాత్రమే. ఏ ప్రభుత్వం వచ్చినా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం అంటుందే తప్ప..ఆచరించి చూపడం లేదు. ఈ విధానం మారలి. క్రీడలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలి. ఆర్థికంగా వారికి అండగా నిలవాలి. క్రీడ ఏదైనా నేర్చుకునేం దుకు అవసరమైన వసతులు కల్పించాలి. అప్పుడే భారత్ ప్రపంచస్థాయిలో సగర్వంగా నిలబడగలుగు తుంది. క్రీడాకరులు అందుకు సిద్దంగా ఉన్నారు. ఇటీవలి మహిళా క్రికెట్ కప్ విజేతల ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. ఇందులో ఆడిన




వారంతా దేశం కోసం చెమటోడ్చారు. తాము పడ్డ కష్టాన్ని మరచిపోయి, దేశ కీర్తిపతాకను రెపరెపలాడించారు. ఈ క్రమంలో ఐదు దశాబ్దాల కలను భారత మహిళలు సాకారం చేశారు. ఆకాశమే హద్దుగా అద్భుత ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. అడ్డంకులన్నీ అధిగమించి, బలమైన దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగులతో ఓడించడం ద్వారా భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించింది. దీంతో దేశం గర్వించింది. అయితే దీని వెనక ఒక్కో అమ్మాయి వ్యథాభరిత జీవితం ఉంది. క్రికెట్‌లో తాము రాణించడానికి వ్యక్తిగతం గా ఎంతో శ్రమించారు. ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. 1973లో మనదేశంలో మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ పోటీల్లో భారత మహిళల ప్రస్థానం మొదలైంది. తొలితరం క్రికెటర్లు సొంత బ్యాటు, కిట్టు లేకపోయినా, జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ సొంత డబ్బులపైనో, చందాల పైనో ఆధారపడి దేశం తరపున ఆడారు. ఆ తరువాత స్పాన్సర్లు ముందుకు రావడం, 2005లో బిసిసిఐ పరిధిలోకి రావడం జరిగాయి. 2022లో పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని, మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టడం,అంతర్జాతీయ క్రికెటర్లతో ఆడే అవకాశం లభించడం, ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రావడం వంటి పరిణామాలతో మహిళల క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లాయి. ఈ క్రమంలో వారు ఎదుర్కొన్న కష్టనష్టాలు అన్నీ దేశం కోసమే అని చెప్పక తప్పదు. తమ వ్యక్తిగత ప్రతిష్ట కోసమో లేదా డబ్బు సంపాదన కోసమో వారు ఆడలేదు. వారు భారత పతకాను ఎగరేయడం వెనక ఉన్న కష్టాలను తెలుసుకుని ప్రోత్సాహనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాలి. అవసరమైతే కేంద్రమే క్రీడలకు సంబంధించి ప్రోత్సాహక కమిటీని ఏర్పాటు చేసి ఇలాంటి కష్టాలను అధిగమించేలా చేయాలి. ఇకపోతే వరుసగా రెండుసార్లు అండర్- 19 అమ్మాయిల జట్టు ప్రపంచకప్ నెగ్గడం, తాజాగా సీనియర్ జట్టు విజయం సాధించడం మహిళా క్రికెట్‌లో ఉజ్వల భవితకు పునాది. ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాలతో డీలాపడిన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో అమోల్ మజుందార్ కోచ్‌గా, మెంటార్‌గా అందించిన ప్రోత్సాహం ఆటగాళ్లలో మానసిక దృఢత్వాన్ని తీసుకొచ్చింది. వన్డే ప్రపంచకప్ టైటిల్ కొట్టడం లో ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో.. తెర వెనుక కోచ్ పాత్ర అంతకుమించి ఉంటుంది. క్రీడాకారిణుల ఫిట్‌నెస్, జట్టు ఎంపిక, కెప్టెన్, ఆటగాళ్లకు దిశా నిర్దేశం, డ్రింక్స్‌బ్రేక్ సమయంలో కెప్టెన్‌కు ఎత్తుగడలను చేరవేయడం.. ఇలా ప్రతి విభాగంలో కోచ్ పాత్ర మరువలేనిది. ఇందుకు నిదర్శనమే వన్డే ప్రపంచకప్‌ను సాధించిన వెంటనే టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పరిగెత్తుకొని వెళ్లి ఒక వ్యక్తి కాళ్లకు నమస్క రించి, ఆలింగనం చేసుకొని కన్నీళ్లు పెట్టుకోవడం. అతడు మరోవరో కాదు.. టీమిండియా హెడ్ కోచ్ అమోల్ మజుందార్. క్రికెటర్‌గా 21ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో ఏనాడూ జాతీయ జట్టుకు ఎంపకవ్వని ఆయన, ఇప్పుడు కోచ్‌గా మహిళా జట్టుకు దిశానిర్దేశం చేస్తున్న తీరు అభినందనీయం. ఈ విజయంలో అతనిదీ ప్రత్యేక పాత్ర అని చెప్పక తప్పదు. మజుందార్ దేశవాళీ క్రికెట్ ఆడే క్రమంలో భారత క్రికెట్ జట్టులో మరో సచిన్ అవుతాడని భావించారు. దేశవాళీ క్రికెట్లో ముంబయి తరఫున పరుగుల వరద పారించాడు. 'ది వాల్'గా పేరు తెచ్చుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచుల్లో 11,167పరుగులు చేశాడు. ఇందులో 30సెంచరీల, 60అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇక 113 లిస్ట్-ఎ క్రికెట్ మ్యాచుల్లో 3,286 పరుగులు కొట్టాడు. 3సెంచరీలు, 26అర్ధసెంచరీలు చేశాడు. కానీ ఆయనకు ఒక్కసారి కూడా టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కలేదు. అయినా నిరుత్సాహానికి గురికాలేదు. భారత మహిళలజట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక తన పూర్వ వైభవాన్ని రంగరించి క్రీడాకారిణులను మెరికల్లా తీర్చిదిద్దాడు. దీంతో భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ గెలవడంలో కోచ్‌గా కీలక పాత్ర పోషించాడు. భారత జట్టు కప్ గెలవడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంత ఉందో అర్థం అవుతుంది. భారత జట్టుకు ఆడలేక పోయినప్పటికీ.. కోచ్‌గా తన కలను సాకారం చేసుకుని సంతృప్తిని పొందాడు. డిఫెండింగ్ ఛాంపియన్, అప్పటికే ఓసారి ఓడించిన ఆస్ట్రేలియా సెమీ ఫైనల్స్‌లో 338 రన్స్ చేయడంతో భారత్ ఓడిపోతుందని క్రీడా పండితులు అంచనా వేశారు. ప్రత్యర్థులంతా చుట్టుముడుతున్నా సహచరులు ఒక్కొక్కరు అవుటవుతున్నా అవరోధాల కు ఎదురొడ్డి ఆస్ట్రేలియాపై అజేయంగా 127 పరుగులుచేసి భారత్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర జెమిమా రోడ్రిగ్స్‌దే. 'ఐ వుడ్ లైక్ టు థాంక్ జీసస్' అన్న ఆమె మాటలను బట్టి ఆమె దైవబలంతో ముందుకు సాగారని గుర్తించాలి. కడపజిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల నల్లపురెడ్డి శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా 9 మ్యాచ్‌లు ఆడి, 14 వికెట్లు తీయడం ద్వారా ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లుసైతం ఆమె బౌలింగ్‌ను ఎదుర్కోవ డానికి ఆపసోపాలు పడటం ఆమె నైపుణ్యానికి నిదర్శనం. 22 వికెట్లతో మన దేశానికే చెందిన దీప్తిశర్మ మొదటిస్థానాన్ని దక్కించుకుని, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకుంది. అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా వైస్ కెప్టెన్ స్మృతి మందాన నిలిచింది. గ్రూప్ దశలో బ్యాటింగ్‌లో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బౌలింగ్‌లో దీప్తి శర్మ, క్రాంతిగౌడ్, రేణుకాసింగ్ సత్తా చాటారు. ఫైనల్స్ లో షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో, హర్మన్ ప్రీత్‌కౌర్ కెప్టెన్సీ ఇలా అందరి సమిష్టి కృషే జగజ్జేతగా నిలిపింది. జట్టులోని చాలామంది దిగువ మధ్యతరగతివారే. శ్రీచరణి తండ్రి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో చిన్న ఉద్యోగి. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ ఎదిగారు. మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కుమార్తె క్రాంతిగౌడ్, తన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలు పెట్టిన అమన్‌జోత్ లాంటి వారంతా అనేక కష్టాలను ఎదురొడ్డి నిలిచిన వారే. ఇన్ని కష్టాల మధ్య కుటుంబ సభ్యులు, కోచ్‌లు లేదా ఇంకెవరైనా ప్రోత్సాహంతో రాణిస్తున్నారే తప్ప ప్రభుత్వ తోడ్పాటు, ప్రోత్సాహం కరువవుతున్నాయి. క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, క్రీడాకారులు రాణించడానికి కావలసిన ప్రోత్సాహం ప్రభుత్వాల నుంచి రావాలి. వారిని రంగం మీద నిలిపి గెలుపుగుర్రాలుగా మలచాలి.

## మరికొంత తగ్గిన బంగారం, వెండి

డాలర్ బలపడుతున్న నేపథ్యంలో బంగారం ధరలు దిగొస్తున్నాయి. ఫెడ్ రేట్‌లో కోతపై కూడా ఆశలు సన్నగిల్లుతుండటంతో బంగారం రేటు నానాటికీ పడిపోతోంది.



అంతర్జాతీయ ట్రెండ్స్‌ను ప్రతిఫలిస్తూ భారత్‌లో కూడా పసిడి ధరలు దిద్దుబాటుకు లోనవుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ. 1,22,540గా ఉంది. నిన్నటితో పోలిస్తే సుమారు రూ.800 మేర ధరలో కోత పడింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,12,450 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లో కూడా భారీగా కోత పడింది. కిలో వెండి ధర రూ.3200 మేర తగ్గి రూ.1,50,900కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఔన్స్ 24 క్యారెట్ బంగారం ధర 3,969 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక డాలర్ సూచీ 0.12 శాతం మేర పెరిగి 99.99కు చేరుకుంది. గత మూడు నెలల్లో ఇదే గరిష్ఠం. దీంతో, పసిడి, వెండి ధరలు దిగొస్తున్నాయి. ఈ వారమంతా బంగారం ధరల్లో దిద్దుబాట్లు తప్పవనేది మార్కెట్ వర్గాల అంచనా.

## భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..

# శత్రు దేశాల గుండెల్లో పరుగెడుతున్న రైళ్లు..!

రక్షణ రంగంలో భారతదేశానికి చిరకాలంగా సహకరిస్తూ వస్తున్న రష్యా.. తాజాగా మరో ఆఫర్ ఇచ్చింది. సుఖోయ్-30MKI ఫైటర్ జెట్లలో ఉపయోగించేందుకు రష్యా తన »»Kh-69 స్టెల్త్ ఎయిర్-లాంచ్డ్ క్రూయిజ్" క్షిపణి (ALCM) టెక్నాలజీకి భారత్‌కు బదిలీ చేసేందుకు ప్రతిపాదించింది. తద్వారా ఈ క్షిపణులను భారతదేశం స్వయంగా తయారుచేసుకుని, తమ యుద్ధ విమానాల్లో ఉపయోగించుకోవచ్చు.

రక్షణ రంగంలో భారతదేశానికి చిరకాలంగా సహకరిస్తూ వస్తున్న రష్యా.. తాజాగా మరో ఆఫర్ ఇచ్చింది. సుఖోయ్-30MKI ఫైటర్ జెట్లలో ఉపయోగించేందుకు రష్యా తన "Kh-69 స్టెల్త్ ఎయిర్-లాంచ్డ్ క్రూయిజ్" క్షిపణి (ALCM) టెక్నాలజీకి భారత్‌కు బదిలీ చేసేందుకు ప్రతిపాదించింది. తద్వారా ఈ క్షిపణులను భారతదేశం స్వయంగా తయారుచేసుకుని, తమ యుద్ధ విమానాల్లో ఉపయోగించుకోవచ్చు. తద్వారా భారత వైమానిక దళ సామర్థ్యం మరింత పెరుగుతుంది. సరికొత్త ఊపునిచ్చింది

ఈ స్టెల్త్ క్షిపణి రేంజ్ 400 కిలోమీటర్ల పరిధి కలిగి ఉంటుంది. ఇది తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ శత్రువుల వైమానిక రక్షణ వ్యవస్థలను తప్పించుకోగలదు. అంటే శత్రుదేశాల రాడార్ల కళ్లు గప్పి లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. Kh-69 సుమారు 710 కేజీల బరువు ఉంటుంది. ఇందులో 310 కేజీల అధిక-పేలుడు వార్‌హెడ్ ఉంటుంది. ఈ క్షిపణిని టాక్టికల్ మిస్సైల్స్ కార్పొరేషన్ (KTRV) అభివృద్ధి చేసింది. ఉక్రెయిన్‌తో రష్యా చేస్తున్న యుద్ధంలో కూడా ఈ క్షిపణిని ప్రయోగించింది.

దీనికి మరికొన్ని ప్రత్యేకతలున్నాయి. డిజైన్ పరంగా చూస్తే ఇది పరిశీలించడానికి ఆస్కారం తక్కువగా ఉండే డిజైన్ కలిగి ఉంటుంది. అలాగే ఇందులో గైడెడ్ వ్యవస్థ, ఇనర్షియల్ నావిగేషన్, ఉపగ్రహం (గ్లోనాస్/GPS)తో పాటు ఎలక్ట్రో-ఆప్టికల్/ఇన్ఫ్రారెడ్ సీకర్ ఉన్నాయి. ఇవన్నీ అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించడానికి వీలు కల్పిస్తాయి.

ప్రస్తుతం భారత వైమానిక దళంలోని సుఖోయ్-30MKI యుద్ధ విమానాల్లో బ్రహ్మోస్-ఎ సూపర్ సోనిక్ క్షిపణులను అమర్చి ప్రయోగిస్తున్నారు. దీని రేంజ్ 290 - 450 కి.మీ పరిధిని కలిగి ఉంటుంది. అయితే బ్రహ్మోస్ బరువు దాదాపు 2,500 కిలోలు. అంటే ఇది ఒకేసారి ఒకటి లేదా రెండు క్షిపణులను మాత్రమే మోసుకెళ్లడానికి వీలు కల్పిస్తుంది. రష్యా అందించే Kh-69 మిస్సైల్ బ్రహ్మోస్‌తో పోల్చితే తేలికైనది. సుఖోయ్ ఫైటర్ జెట్లు ఒకేసారి నాలుగు క్షిపణులను మోసుకెళ్లడానికి వీలుంటుంది. తద్వారా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు



యుద్ధ రంగంలో మరింత మెరుగైన అవకాశాలను కల్పిస్తుంది.

### భారత్‌లోనే తయారీ

ఈ క్షిపణులను తయారు చేసే టెక్నాలజీని బదిలీ చేయడం ద్వారా వాటిని మన దేశంలోనే తయారు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. అయితే ముందుగా భారత్ కనీసం 200-300 Kh-69 మిస్సైళ్లకు ఆర్డర్ పెట్టాల్సి ఉంటుంది. అప్పుడు వాటిలో కొన్నింటిని రష్యా నుంచి నేరుగా భారత్‌కు ఎగుమతి చేసి, మగతావాటిని భారత్‌లోనే తయారు చేయడానికి వీలుగా టెక్నాలజీ, బ్లూప్రింట్ అందజేస్తుంది. భారత్‌లో వీటిని హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (HAL), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (BDL) వంటి సంస్థలను రష్యా తమ భాగస్వాము లుగా ఎంచుకునే అవకాశం ఉంది.

### అవసరాలు.. అడ్డంకులు.. అవకాశాలు

భారత వైమానికదళం అవసరాలను గమనిస్తే 42 స్క్వాడ్రన్లు అవసరం ఉండగా.. ప్రస్తుతం 29 స్క్వాడ్రన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. భారతదేశానికి చిరకాల శత్రు దేశం పాకిస్తాన్‌తో పాటు చైనా నుంచి ముప్పు పెరుగుతున్న సమయంలో రష్యా ఇస్తున్న ఆఫర్ వైమానిక దళ సామర్థ్యాన్ని పెంచడానికి దోహదం చేస్తుంది.

అయితే CAATSA ఆంక్షలు, పశ్చిమ దేశాలతో భారతదేశానికి పెరుగుతున్న రక్షణ సహకారం ఈ ఒప్పందాన్ని క్లిష్టతరం చేసే అవకాశం ఉంది. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని 2026 ప్రారంభంలో భారత ప్రభుత్వం దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

అయితే రష్యా ఆఫర్ భారతదేశానికి ఒక ప్రధాన వ్యూహాత్మక అవకాశంగా పరిగణించవచ్చు. ఇది మేక్ ఇన్ ఇండియా సంకల్పానికి సైతం ఊతమిస్తోంది.

భారత వైమానిక దళంలో ఉన్న సుఖోయ్ ఫైటర్ జెట్ల సామర్థ్యాన్ని సైతం పెంచుతుంది. అలాగే లాంగ్ రేంజ్ స్టెల్త్ ఎటాక్ సామర్థ్యాన్ని సైతం గణనీయంగా మెరుగుపరుస్తుంది.

# మార్పుకోసం..నవశకం కోసం ఈ ప్రస్థానం

**న్యూయార్క్‌లోని కొత్తతరానికి థాంక్యూ**

**నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావన**

**న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్‌దాని**

అమెరికా స్థానిక ఎన్నికల్లో న్యూయార్క్ మేయర్ పదవిని డెమోక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్‌దానీ సొంతం చేసుకున్నారు. ఆ స్థానాన్ని దక్కించుకున్న తొలి ఇండియన్-అమెరికన్ ముస్లింగా చరిత్ర సృష్టించారు. విజయానంతరం ఆయన మాట్లాడుతూ.. భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రస్తావన తీసుకువచ్చారు. మార్పు కోసం, నవ శకం కోసం ఈ రాత్రి తీర్పు వెల్లడైంది. జనవరి ఒకటిన నేను మేయర్‌గా ప్రమాణస్వీకారం చేస్తాను అని జొహ్రాన్ వెల్లడించారు. ఈ సందర్భంగా నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావించారు.

నవశకం వైపు అడుగువేసినప్పుడు, ఒక శకం ముగిసినప్పుడు, సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి నుంచి గళం వినిపించినప్పుడు.. చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి' అని తన విజయానికి ఆపాదించి మాట్లాడారు. ఈ విజయాన్ని కట్టబెట్టిన తన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యూయార్క్‌లోని కొత్తతరానికి థాంక్యూ. మేం




మీకోసం పోరాడుతాం.. ఎందుకంటే మేం మీలాంటివాళ్లమే. మన చేతుల్లోనే భవిష్యత్ ఉంది. రాజవంశాన్ని కూల్చివేశాం. ట్రంప్.. ఇదంతా మీరు చూస్తున్నారని నాకు తెలుసు. మీకు చెప్పడానికి నా వద్ద నాలుగు మాటలు ఉన్నాయి. సౌండ్ పెంచండి. మీరు మాలో ఎవరినైనా చేరుకోవాలంటే మా అందరినీ దాటాలని మమ్‌దానీ నేరుగా ట్రంప్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన అలా మాట్లాడుతుంటే.. ఇది ప్రారంభమవుతుంది అని ట్రూత్ సోషల్‌లో అధ్యక్షుడు రాసుకొచ్చారు. అలాగే రిచర్డ్ అనే ట్యాక్సీ డ్రైవర్‌తో కలిసి సిటీ హాల్‌లో వెలుపల 15 రోజులు నిరాహార దీక్ష చేసిన స్టోరీని వెల్లడించారు. ఇది మీ నగరం, ప్రజాస్వామ్యం మీది.. అని వ్యాఖ్యానించారు. అలాగే తన తల్లిదండ్రులకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. నన్ను తీర్చిదిద్దింది మీరే. నేను మీ కుమారుడిని అయినందుకు గర్వంగా ఉందని అన్నారు. సోషలిస్ట్ భావజాలం ఉన్న మమ్‌దానీ న్యూయార్క్ మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై విజయం సాధించడం విశేషం. ఉగాండా జాతీయుడైన మహమూద్ మమ్‌దానీ- భారతీయ సినీ డైరెక్టర్ మీరానాయర్‌కు జన్మించిన సంతానమే జొహ్రాన్. ఈ ఎన్నికను ట్రంప్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆయనే స్వయంగా ప్రచారంలో పాల్గొన్నా కూడా ఫలితం లేకపోయింది. ఇక, అతిపిన్న వయస్సు (34 ఏళ్లు)లో న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన వ్యక్తిగా మమ్‌దానీ రికార్డ్ సృష్టించారు. విజయం తర్వాత మేయర్ ఆఫీస్ దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

# రైతులపై కపట ప్రేమలు మానండి

రైతుల పేరు మీద వైసీపీ నేతలు చేస్తున్న నాటకాలు ఆపాలని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హితవు పలికారు. కడప జిల్లాలో ఏమి జరుగుతోందో చూడని అవినాశ్‌కి.. ఇప్పుడు రైతులపై అంత ఆకస్మికంగా ప్రేమ ఎందుకు.. వచ్చిందని ప్రశ్నించారు. ఈ మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఉల్లి రైతులు నష్టపోకూడదని సీఎం చంద్రబాబు ఆలోచించి హెక్టార్‌కి రూ.50,000 చొప్పున అందజేయాలని నిర్ణయించారని తెలిపారు. తమ ప్రభుత్వంలో రూ.104 కోట్ల 57లక్షల ఉల్లి రైతులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టినప్పుడు క్వింటాకు రూ.1200 వెచ్చించి మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్ నందు సుమారు రూ.17 కోట్ల 22 లక్షల విలువ గల ఉల్లి పంటను కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. ఉల్లి పంట పాడవ్వకుండా రైతులకు తమ ప్రభుత్వం మేలు చేసిందని వివరించారు. 2020లో వైసీపీ హయాంలో ఉల్లి ధర పడిపోతే మద్దతు ధర రూ.770లు ప్రకటించడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 129 మంది రైతుల నుంచి 970 మెట్రిక్ టన్నుల ఉల్లిని మాత్రమే సేకరించి, రైతులకు కేవలం రూ.75 లక్షలు మాత్రమే చెల్లించిన విషయం అవినాష్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు మంత్రి అచ్చెన్నాయుడు. జగన్ హయాంలో క్వింటాకు ఉల్లి ధర రూ.770 నిర్ణయించారని, కానీ రైతుల శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు ఉత్తమ నిర్ణయంతో క్వింటాకు రూ.1200 పెట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో రైతుల సమస్యలు అవినాశ్‌రెడ్డికి కనిపించలేదా..? అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడు, విపత్తుల సమయంలో మాత్రమే వైసీపీ నేతలు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు మంత్రి అచ్చెన్నాయుడు. గత ఐదేళ్లు రైతులు ఇబ్బందులు పడుతుంటే అవినాశ్ రెడ్డి కళ్లకు గంతలు కట్టుకుని ఉన్నారా..? అని ప్రశ్నించారు. నష్టపరిహారం ÷ళ్లు పెండింగ్‌లో పెట్టింది కూటమి ప్రభుత్వం కాదని? గత జగన్ ప్రభుత్వ గందరగోళ విధానాలేనని ఎద్దేవా చేశారు. రైతుల పేరు చెప్పుకుంటూ రాజకీయ లాభం చూడటం అవినాశ్‌రెడ్డి స్వభావమని విమర్శించారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే కనీస అర్హత అవినాశ్‌రెడ్డికి లేదని ÷ర్ అయ్యారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉద్ఘాటించారు. అన్నదాతలకు అందచేస్తున్న పథకాలు, ధరలు తగ్గినప్పుడు వారికి ఇస్తున్న పరిహారాలు వైసీపీ నేతల కళ్లకు కనపడటం లేదా..? అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నల వర్షం కురిపించారు.





# బార్క్ నకిలీ శాస్త్రవేత్తపై లోతైన విచారణ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా కలకలం రేకెత్తిస్తున్న బార్క్ నకిలీ శాస్త్రవేత్త కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బార్క్ శాస్త్రవేత్తనని చెప్పుకుంటున్న నిందితుడు అక్తర్ కుతుబుద్దీన్ హుస్సైన్‌ను ఇటీవల ముంబై పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితుడిది ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ అని పోలీసులు గుర్తించారు. అతడి సోదరుడు అదిల్‌ను ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. హుస్సైన్ సోదరులకు 1995 నుంచే అనుమానాస్పద రీతిలో వివిధ మార్గాల్లో నిధులు అందాయని ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. మొదట్లో లక్షల్లో చెల్లింపులు జరిగాయని, ఆ తరువాత ఇవి కోట్లకు చేరుకున్నాయని కూడా గుర్తించారు. భారత న్యూక్లియర్ వ్యవస్థలకు సంబంధించి సీక్రెట్ సమాచారం చేర వేసినందుకు నిందితులు ఈ డబ్బులు పుచ్చుకున్నట్టు అనుమానిస్తున్నారు. అక్తర్‌కు చెందిన ఓ ప్రైవేటు బ్యాంకు అకౌంట్‌లో అనేక అనుమానాస్పద లావాదేవీలు బయటపడ్డాయి. తానో సైంటిస్టు అని



చెప్పుకున్నందుకు అతడిని 2004 దుబాయ్‌ను బహిష్కరించినట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ఝార్ఖండ్‌లో తనకు తెలిసిన వారి ద్వారా ఆ సోదరులు పలు ఫేక్ ఐడీలను కూడా సమకూర్చుకున్నట్టు తెలిసింది. తమ పేరిట ఉన్న పలు బ్యాంకు అకౌంట్లను కూడా వారు క్లోజ్ చేసినట్టు దర్యాప్తులో తేలింది. ఇద్దరికీ ఐఎస్ఐతో లింకు ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులిద్దరూ పాకిస్థాన్‌కు వెళ్లివచ్చినట్టు కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తన ఐడీలు మార్చుకుంటూ అక్తర్ సీక్రెట్ జీవితాన్ని గడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వీటి సాయంతోనే విదేశీ పర్యటనలు చేశాడని అనుమానిస్తున్నారు. అరెస్టు సమయంలో అతడి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్స్‌తో పాటు పాత బ్యాంకు అకౌంట్‌ల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితులకు ఏయే మార్గాల్లో నిధులు వస్తున్నాయో తెలుసుకునేందుకు విస్తృత స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

# సమష్టి ప్రదర్శనతోనే చిరస్మరణీయ విజయం



### మహిళల విజయంపై ఐసీసీ ఛైర్మన్ జై షా

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో అర్ధశతాబ్దపు కలను సాకారం చేసుకుంది. 2005, 2017 ఫైనల్లో తృటిలో టైటిల్ చేజారగా.. ఈసారి మాత్రం భారత మహిళల జట్టు ఏ తప్పు చేయలేదు. ఒత్తిడిని చిరునవ్వుతో ఛేదిస్తూ తొలిసారి ఫైనల్ చేరిన సౌతాఫ్రికాను మట్టికరిపించింది. 1983 ప్రపంచకప్‌లో కపిల్ సేన సాధించిన విజయం భారత క్రికెట్ గతిని మార్చినట్టే.. హర్మన్ సేన సాధించిన తాజా విజయం మహిళల క్రికెట్‌ను మరో మెట్టెక్కించనుంది. ఫైనల్లో షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోతో పాటు అమన్‌జోత్ కౌర్ మ్యాచ్ విన్నింగ్ క్యాచ్ టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించాయి. తెలుగు తేజం శ్రీచరణి టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబర్చగా.. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్‌తో బ్యాట్‌తో సత్తా చాటారు. ఈ విజయం నేపథ్యంలో భారత మహిళా క్రికెటర్లపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. తాజాగా భారత మహిళల విజయంపై స్పందించిన ఐసీసీ ఛైర్మన్ జై షా.. సమష్టి ప్రదర్శనతోనే ఈ చిరస్మరణీయ విజయం దక్కిందని చెప్పాడు. 'నాకు మహిళల క్రికెట్ అంటే చాలా ఇష్టం. భారత మహిళల జట్టు ఐసీసీ ట్రోఫీని నెగ్గడం సంతోషంగా ఉంది. ఇలాంటి విజయం, మహిళల క్రికెట్ అభివృద్ధి కావడం వంటి పరిణామాలన్నీ మన కళ్ల ముందే కార్యరూపం దాల్చాయి. అందుకోసం ప్రత్యక్షంగా, తెర వెనుక పనిచేస్తోన్న కష్టానికి ఇదే నిదర్శనం.'అని జైషా పేర్కొన్నాడు.

## ఎందుకు పక్కన పెట్టామో..
# అర్ష్‌దీప్ సింగ్‌కు అర్థమైంది

### టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

ఆస్ట్రేలియాతో తొలి రెండు టీ20లకు అర్ష్‌దీప్ సింగ్‌ను ఎందుకు పక్కనపెట్టామో అతనికి అర్థమైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2026 కాంబినేషన్ కోసం ప్రయోగాలు చేస్తున్నామని, ఈ క్రమంలోనే అతనికి అవకాశం దక్కలేదని వివరణ ఇచ్చాడు. ఈ విషయాన్ని అర్ష్‌దీప్ సింగ్ అర్థం చేసుకున్నాడని చెప్పాడు. మూడో టీ20లో రీఎంట్రీ ఇచ్చిన అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 జరగనున్న నేపథ్యంలో మోర్నీ మోర్కెల్ బుధవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా అర్ష్‌దీప్ సింగ్‌ను పక్కనపెట్టడంపై క్లారిటీ ఇచ్చాడు. 'అర్ష్‌దీప్ సింగ్ చాలా అనుభవం కలిగిన బౌలర్. మా ప్రయోగాల గురించి అతను పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అతను ఒక ప్రపంచ స్థాయి బౌలర్. పవర్ ప్లేలో అత్యధిక వికెట్లు తీసే బౌలర్. జట్టుకు అతని విలువ ఏంటో మాకు తెలుసు. అయితే ఈ పర్యటనలో మేం వివిధ కాంబినేషన్లను ప్రయత్నించాం. జట్టు ఎంపిక టీమ్‌మేనేజ్‌మెంట్‌తో పాటు ఆటగాళ్లకు సవాలే. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట విభిన్నమైన కాంబినేషన్స్‌ను ప్రయత్నించాలనుకుంటున్నాం. దీంతో ఆటగాళ్లు తమకు అవకాశం రాలేదని నిరాశకు గురవ్వడం సహజమే. కానీ, మేనేజ్‌మెంట్ మరోలా ఆలోచిస్తుంది. ఆటగాళ్లను ఇంకా శ్రమించేలా ప్రోత్సహిస్తాం. ఎప్పుడూ అవకాశం వచ్చినా అత్యుత్తమ ఆటతీరు కనబర్చేలా సన్నద్ధం చేస్తాం. వచ్చే పొట్టి కప్‌లోగా చాలా తక్కువ మ్యాచ్‌లనే ఆడాల్సి ఉంటుంది. ఒత్తిడి సమయాల్లో ఆటగాళ్లు ఎలా రాణిస్తారనేది పరీక్షించాం. వారి సత్తాపై మాకు ఎలాంటి సందేహం లేదు. మ్యాచ్‌లను ఎలా గెలవాలనే దానిపైనే వర్కౌట్ చేస్తున్నాం.'అని మోర్నీ మోర్కెల్ వెల్లడించాడు. నితీష్ కుమార్ రెడ్డి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, నాలుగో టీ20లో బరిలోకి దిగుతాడని మోర్కెల్ తెలిపాడు.




# హర్మన్‌ప్రీత్‌కు అరుదైన గౌరవం

వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో ఆమె మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల భారత మహిళల జట్టుకు వన్డే వరల్డ్‌కప్ అందించిన తొలి కెప్టెన్‌గా హర్మన్ చరిత్రలోకెక్కింది. దీంతో ఆమె గౌరవార్థం ఈ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు జైపూర్ వ్యాక్స్ మ్యూజియం వ్యవస్థాపకులు అనూప్ శ్రీవాస్తవ తెలిపారు.

టీమ్ఇండియా వరల్డ్‌కప్ విజయానికి ఈ విగ్రహాన్ని అంకితం ఇవ్వనున్నట్లు శ్రీవాస్తవ పేర్కొన్నారు. 'భారత మహిళల క్రికెట్ జట్టుకు వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మైనపు విగ్రహాన్ని జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్నాం. ఈ విగ్రహాన్ని మహిళల ప్రపంచకప్ విజయానికి అంకితం ఇస్తాం. ఆమె క్రికెట్‌కు సేవలు అందించడమే కాదు, ఈ గెలుపుతో మహిళా సాధికారతకు తోడ్పడింది.

మేం ప్రముఖ వ్యక్తులను మాత్రమే కాదు, హర్మన్‌లా భవిష్యత్ తరానికి స్ఫూర్తినిచ్చే వాళ్ల విగ్రహాలు కూడా పెడతాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తుంది' అని శ్రీవాస్తవ తెలిపారు. దీంతో జైపూర్‌లోని నహర్‌గఢ్ కోటలో ఉన్న ఈ మ్యూజియంతో మార్చి 8, 2026న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు హర్మన్ మైనపు విగ్రహం ఆవిష్కరించనున్నారు. కాగా, ఈ మ్యూజియంలో ఇప్పటికే ఎంఎస్ ధోని, సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజ క్రికెటర్ల మైనపు విగ్రహాలు ఉన్నాయి. తాజా విగ్రహంతో, ప్రపంచ కప్ విజేతలు ధోనీ, హర్మన్ ఇద్దరు కెప్టెన్ల విగ్రహాలు ఉండనున్నాయి. వీటితోపాటు ఇదే మ్యూజియం కల్పనా చావ్లా, సైనా నెహ్వాల్, మదర్ థెరిసా, రాజమాత గాయత్రి దేవి, హాది రాణి వంటి మహిళా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇక ఈ లిస్ట్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ చేరనుంది. 2025 వరల్డ్‌కప్ ఫైనల్‌లో సౌతాఫ్రికాపై భారత్ 52 పరుగుల తేడాతో నెగ్గి ఛాంపియన్‌గా నిలిచింది. 52ఏళ్ల వరల్డ్‌కప్ హిస్టరీలో భారత్ ట్రోఫీని అందుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో హర్మన్ తన కెప్టెన్సీ స్కిల్స్‌తో ఆకట్టుకుంది. ప్రత్యర్థుల అంచనాలకు అందని వ్యూహాలతో దెబ్బ తీసింది. ఫైనల్‌లో షెఫాలీ వర్మ బౌలింగ్ అందుకు నిదర్శనం. ఈ విషయాన్ని సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ కూడా మ్యాచ్ అనంతరం అంగీకరించింది. ఇలాంటి వ్యూహాలతో హర్మన్ తనదైన మార్క్ చూపించి భారత్‌ను ఛాంపియన్‌గా నిలపడంలో తనవంతు పాత్ర పోషించింది. ఇక భారత్‌కు (పురుషుల, మహిళల) వన్డే వరల్డ్‌కప్ అందించిన మూడో కెప్టెన్‌గా హర్మన్ రికార్డు సాధించింది. ఇప్పటికే పురుషుల జట్టు రెండుసార్లు (1983 కపిల్ దేవ్, 2011 మహేంద్రసింగ్ ధోనీ) విజేతగా నిలవగా, తాజాగా మహిళల జట్టును హర్మన్ విజేతగా నిలిపింది.






# తిరిగి టీంలోకి రిషబ్ పంత్

### దక్షిణాఫ్రికాతో టెస్ట్ జట్టు ప్రకటన

దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్ కోసం టీమ్ ఇండియాను ప్రకటించింది. రిషబ్ పంత్ తిరిగి జట్టుకు వైస్ కెప్టెన్‌గా వచ్చాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత్ ఆడుతున్న మూడో టెస్ట్ సిరీస్ ఇది. బుధవారం నాడు ప్రెస్ రిలీజ్ విడుదల చేస్తూ బీసీసీఐ జట్టును ప్రకటించింది. నేషనల్ టీమ్‌తో పాటు, బోర్డు దక్షిణాఫ్రికా 'ఎ'తో 3 వన్డే మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇండియా 'ఎ' జట్టును కూడా ప్రకటించింది. దీనికి తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ పర్యటనలో నాల్గో టెస్ట్‌లో పంత్‌కు గాయమైంది, ఇందులో అతని కాలి వేలికి ఫ్రాక్చర్ అయింది. ఆ తర్వాత అతను ఆసియా కప్, వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియా పర్యటనలకు దూరమయ్యాడు. 100 రోజులకు పైగా తర్వాత అతను తిరిగి వచ్చాడు. ఆకాష్ దీప్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. పంత్ రాకతో ఎన్ జగదీశన్ జట్టు నుంచి బయటకు వెళ్లవలసి వచ్చింది. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకాష్ దీప్ వచ్చాడు.

### దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ కోసం భారత్ జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్, వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాష్ దీప్.

# హారిస్ రౌఫ్ మూల్యాన్ని చెల్లించుకున్నాడు

సెప్టెంబర్ లో జరిగిన ఆసియా కప్ సమయంలో క్రికెట్ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు ఐసీసీ చర్యలు చేపట్టింది. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్ లపై ఐసీసీ చర్యలు తీసుకుంది. ఆసియా కప్ టోర్నమెంట్ సమయంలో 4 డీమెరిట్ పాయింట్లు రావడంతో హారిస్ రౌఫ్‌ను 2 వన్డే మ్యాచ్‌ల నుండి సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. పాక్ పేసర్ రౌఫ్ కు భారత్ తో జరిగిన 2 వేర్వేరు ఘటనలకుగాను 30-30 శాతం జరిమానా విధించారు. దీనితో పాటు దక్షిణాఫ్రికాతో మంగళవారం ప్రారంభమైన వన్డే సిరీస్ లో 2 మ్యాచ్ ల నుండి హారిస్ రౌఫ్‌ను నిషేధించారు. నవంబర్ 6న జరిగే రెండో మ్యాచ్ లో కూడా అతను ఆడేందుకు అవకాశం లేదు. హారిస్ రౌఫ్ కు ఈ 2 ఘటనలకు గాను నాలుగు డీమెరిట్ పాయింట్లు వచ్చాయి. వీటిని ఐసీసీ నిబంధనల ప్రకారం 2 సస్పెన్షన్ పాయింట్లుగా మార్చింది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ పై మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది ఐసీసీ. సూర్య సైతం క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించినట్లు భావించింది. భారత కెప్టెన్ పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు సంఘీభావం తెలుపుతూ భారత సాయుధ దళాలకు మద్దతు ఇచ్చాడు. జస్ప్రీత్ బుమ్రాపై కూడా ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. ఎందుకంటే పాక్‌తో జరిగిన ఫైనల్లో రౌఫ్ ను ఔట్ చేసిన తర్వాత అతను 'విమానం కూలిపోయింది' అని సైగ చేశాడు. సూర్యకుమార్ చేసిన వ్యాఖ్యలపై 30 శాతం జరిమానా విధించింది. ఈ వార్తను మొదట సెప్టెంబర్ 26న పిటిఐ రిపోర్ట్ చేసింది. సెప్టెంబర్ 14న జరిగిన మ్యాచ్ లో విమానం కూలిపోవడాన్ని సూచించే అభ్యంతరకరమైన సంజ్ఞలు చేసినందుకు హారిస్ రౌఫ్ తప్పు చేసినట్లు ఐసీసీ తేల్చింది. రౌఫ్ ఆపరేషన్ సింధూర్ లో భారత సైనిక చర్యను ఎగతాళి చేశాడు. ఈ ఘర్షణలో 6 భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్తాన్ చేసిన వాదనకు మద్దతు తెలిపాడు. సెప్టెంబర్ 28న బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు భారత అభిమానులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తూ, రౌఫ్ అదే సంజ్ఞను మరోసారి చేశాడు. పాకిస్తాన్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్ కు కూడా ఒక డీమెరిట్ పాయింట్ ఇచ్చారు. భారత ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ ను ఎలాంటి జరిమానా లేదా డీమెరిట్ పాయింట్ విధించలేదు. ఫర్హాన్ భారత్ పై హాఫ్ సెంచరీ చేసిన తర్వాత బ్యాట్ తో తుపాకీని కాల్చినట్లు సంజ్ఞ చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. సెప్టెంబర్




14, 2025న 'సూర్యకుమార్ యాదవ్ (భారత్) ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని నిబంధన 2.21 ను ఉల్లంఘించాడు. ఇది క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించినది. సూర్య మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధిస్తున్నాం. 2 డీమెరిట్ పాయింట్లు ఇస్తున్నామని' ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం 'సాహిబ్జాదా ఫర్హాన్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని పేర్కొంది. 'హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. రౌఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించాం. ఫలితంగా అతనికి 2 డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' ఐసీసీ పేర్కొంది. అర్షదీప్ విషయం సోషల్ మీడియా క్లిప్ నకు సంబంధించినది. అతను పాకిస్తాన్ అభిమానులను ఎగతాళి చేస్తూ కనిపించాడు. అయితే ఐసీసీ మ్యాచ్ రిఫరీకి ఇది అభ్యంతరకరంగా అనిపించలేదు. సెప్టెంబర్ 21న భారత్, పాకిస్తాన్ సూపర్ 4 మ్యాచ్ కు సంబంధించినది. సెప్టెంబర్ 28న జరిగిన ఫైనల్ లో చేసిన చర్యలకు విధించిన ఆంక్షలపై ఐసీసీ ఇలా స్పందించింది. 'జస్ప్రీత్ బుమ్రా (భారత్) క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించిన నిబంధన 2.21 కింద మోపబడిన ఆరోపణను, ప్రతిపాదిత అధికారిక హెచ్చరికను అంగీకరించాడు. ఫలితంగా అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని తెలిపింది. మునుపటి విచారణ సమయంలో తనను తాను నిర్దోషిగా చెప్పుకున్న రౌఫ్, భారత ప్రేక్షకులకు మళ్లీ అభ్యంతరకరమైన సంజ్ఞలు చేస్తూ కనిపించాడు.

'ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ నిర్వహించిన విచారణ తర్వాత హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) మళ్లీ నిబంధన 2.21 ను ఉల్లంఘించాడని తేలింది. అతనికి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించగంతో పాటు 2 అదనపు డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' తెలిపింది.

# పెద్దిలో చికిరి చికిరి స్టెప్పులు



రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. జాన్వీ కథానాయిక కాగా ఆస్కార్ విన్నర్ రెహామాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ షాట్ వీడియో ప్రపంచ వ్యాప్తంగా తెగ వైరల్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతుండగా ఇటీవలే శ్రీలంకలో ఓ పాట సైతం చిత్రీకరణ పూర్తి చేసుకుని టీం తిరిగి వచ్చింది. వచ్చే మార్చిలో ఈ మూవీ ప్రేక్షకులకు ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి ఒక్కొక్కటిగా అప్డేట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి పాట రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బుచ్చి బాబు సానా పాటకు సంబంధించి బుధవారం చిన్న గ్లిమ్స్ రిలీజ్ చేసి నవంబర్ 7, శుక్రవారం రోజున పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బుచ్చిబాబు ఏకంగా ఈ సినిమా సంగీత దర్శకుడు రెహామాన్ నే రంగంలోకి దింపాడు. ఆయనతో తన ఫస్ట్ ఇంటరాక్షన్ గురించి వివరించి చివరకు ఈ సినిమా సాంగ్ సిట్యూవేషన్ చెప్పి ఓ ట్యూన్ అడగడం అయన

వెంటనే చికిరి చికిరి అంటూ ఓ ట్యూన్ ఇవ్వడం అంతా చకచకా జరిగిపోయినట్లు చూపించారు. చివర్లో పాట ట్యూన్‌కు తగ్గట్టు రామ్‌చరణ్ వేసిన స్టెప్స్ ను సైతం చూపించి ఒక్క సారిగా పాటపై హైప్ పెంచేశారు.

ఈ వీడియో బయటకు వచ్చిన క్షణాల్లోనే రామ్ చరణ్ హుక్ స్టెప్ సోషల్ మీడియాను కమ్మేపింది. రామ్ చరణ్ , మెగా అభిమానులే కాక చాలామంది నెటిజన్లు సైతం ఈ వీడియోకు, ఆ స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. రానున్న నెలరోజులు ఈ పాట ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎక్కడ చూసినా రామ్ చరణ్ స్టెప్పులే దర్శణమివడం గ్యారంటీ.



## బోర్డర్-2 నుంచి వరుణ్ ధావన్ లుక్ విడుదల


వరుస సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్న బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం బోర్డర్ 2. ఈ సినిమాకు సినిమాకు అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహించనుండగా.. భూషణ్‌కుమార్, కృష్ణన్ కుమార్, జేపీదత్తా, నిధిదత్తా కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ ధావన్, దిలిజిత్ దోసాంజే, అహాన్ శెట్టి, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ నుంచి చిత్రబృందం తాజాగా వరుణ్ ధావన్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. వరుణ్ ధావన్ ఇందులో హోషియర్ సింగ్ దాహియా అనే పాత్రలో కనిపించబోతుండగా ఈ ఫస్ట్ లుక్‌లో వరుణ్ ధావన్ గన్ పట్టుకుని శత్రువులను కాల్చుతున్నట్లు కనిపిస్తుంది.



## గర్ల్‌ఫ్రెండ్ మూవీ సంతృప్తిని ఇచ్చే సినిమా

**- నిర్మాత అల్లు అరవింద్**

రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో రూపొందిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఈనెల 7న విడుదల కానుంది. అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రం ట్రైలర్ నుంచి మంచి హైప్ క్రియేట్ చేయడంతో సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో తాజాగా బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. అల్లు అరవింద్ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. నేను చాలా సినిమాలు తీశాను, డబ్బులు సంపాదించాను. కానీ 'ది గర్ల్‌ఫ్రెండ్' మాత్రం తృప్తికోసం తీశాను అంటూ వ్యాఖ్యానించారు.



2021లో ఈ కథ విన్నప్పటి నుంచి సినిమా తీయాలని ఎదురుచూశాను. సమాజానికి బోల్డ్‌గా కొన్ని విషయాలు చెప్పాలనిపించింది. అందుకే ఈ సినిమా చేశాము. ఇది చాలా సున్నితమైన సబ్జెక్ట్. ప్రతి యువకుడు, యువతి తప్పకుండా చూడాల్సిన సినిమా ఇదని అన్నారు. ఇందులో ఎన్ని పాటలు ఉన్నాయి, ఎన్ని ÷టింగ్‌లు ఉన్నాయి, ఏం పంచ్‌లు ఉన్నాయనేది ఈ సినిమాకు వర్తించదని, 'మన ఇంట్లో ఆడవాళ్ల మనస్సుల్లో ఏమి కోరికలు, భావోద్వేగాలు ఉంటాయో ఈ సినిమా చూపిస్తుంది. కథ అతి సున్నితంగా మొదలై, అతి ఘాటుగా ముగుస్తుంది. చూసిన వారు ఈ సినిమాను మర్చిపోలేరు? ఈ కథ వెంటాడుతుంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' కి తక్కువ రేటింగ్ ఇవ్వలేరు అంత సంతృప్తికరంగా ఉంటుంది సినిమా అని స్పష్టం చేశారు. ప్రస్తుతం అల్లు అరవింద్ కూడా ముందుకు వచ్చి చెప్పిన ఈ మాటలు ఇప్పుడు సినిమాపై మరింత బజ్ తీసుకొచ్చేలా ఉన్నాయి. ఇదిలా ఉంటే.. ఓ విలేఖరి ఇటీవల బండ్ల గణెళిష్ చేసిన కామెంట్స్ గురించి మాట్లాడాలి అని అడగగా.. నేను ఆయన గురించి మాట్లాడను నాకంటూ ఓ స్దాయి ఉంది అంటూ కౌంటర్ ఇచ్చారు.

## అనగనగా ఒక రాజులో పాట పాడిన నవీన్

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.



## మగాళ్లకు కూడా వస్తే.. బాధ తెలుస్తుంది

### టీవీ షోలో రష్మిక మందన్న సంచలన కామెంట్స్

ఈ ఏడాది ఇండియన్ సినీ పరిశ్రమలో రష్మిక మందన్నా సందడి ఎక్కువగా కనిపిస్తోంది. నెల, రెండు నెలల గ్యాప్‌లో ఓ సినిమా విడుదల చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటివరకు ఆమె నటించిన నాలుగు సినిమాలు థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించాయి. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'పుష్ప 2' తో రష్మిక తన సత్తా చాటుకోగా, ఈ ఏడాది 'ఛావా', 'సికందర్', 'కుబేర', 'థామా' చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో రష్మిక పలు ప్రమోషనల్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. షోలు, ఇంటర్వ్యూలలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఆమె జగపతిబాబు హోస్ట్‌గా రన్ అవుతున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షోలో పాల్గొని సందడి చేసింది. ఈ సందర్భంగా రష్మిక తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంటూ, స్కూల్ రోజుల్లో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసింది. జగపతిబాబు అడిగిన ప్రశ్నలకు రష్మిక ఇచ్చిన సరదా సమాధానాలు ప్రేక్షకులను అలరించాయి. అంతేకాకుండా, షోలో రష్మిక మహిళలకు సంబంధించిన సమస్యలపై మాట్లాడింది. 'మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని అనిపించింది. ఆ సమయంలో మహిళలు ఎదుర్కొనే నొప్పి, బాధ ఎలా ఉంటుందో అబ్బాయిలు కూడా అనుభవిస్తే వారికి అర్థం అవుతుందని చెప్పి అందర్నీ ఆకట్టుకుంది. ఆమె మాటలకు జగపతిబాబు, ఆడియెన్స్ ఇద్దరూ చప్పట్లు కొట్టారు. ఇక రష్మిక నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీగా తెరకెక్కింది. దీక్షిత్ శెట్టి హీరోగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా, ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ప్రేమకథలోని కొత్త కోణాన్ని చూపించబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమా చూసిన తర్వాత అమ్మాయిలు తమ లవర్స్ గురించి ఆలోచించేలా ఉంటుందని ఆయన చెప్పడం విశేషం. ప్రస్తుతం రష్మిక మందన్నా 'మైసా' అనే లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తోంది. అదనంగా బాలీవుడ్‌లో ఒక కొత్త ప్రాజెక్ట్‌లోనూ భాగమవుతోంది. అంతేకాకుండా విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంక్రిత్యాన్ దర్శకత్వంలో నటిస్తోంది. పలు క్రేజీ ప్రాజెక్టులపై చర్చలు కొనసాగుతున్నాయని సినీ వర్గాల సమాచారం.



## మోహన్ లాల్ తనయుడు ప్రణవ్ లాల్ మూవీ డీయస్ ఈరే

మలయాళ స్టార్ నటుడు మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ లాల్ చాలా రోజుల తర్వాత నటిస్తున్న తాజా చిత్రం 'డీయస్ ఈరే'. ఈ సినిమాకు బ్రహ్మయుగం దర్శకుడు రాహుల్ సదశివన్ దర్శకత్వం వహించగా మలయాళంలో ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం తెలుగులో నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతుంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154